# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

**శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా**

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 40 సంచిక 12
పేజీలు 44
ఆగస్ట్ 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.
M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా
మేనేజరు
సమర్థ సద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు
గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో ............................ ....... పేజీ**


దాశరథీ శతకము ........................................ 4
శ్రీబాబూజీ ఉవాచ........................................ 5
అమ్మమాట........................................ 9
అగస్త్య హృదయం ........................ ............ 11
దృఢమైన భక్తి .................. ................ 13
వేదాలు - ఉపనిషత్తులు.......... ................... 14
ఛాందోగ్యోపనిషత్ సారము ...................... 16
ఏడు చేపల కథ ........................................ 18
ప్రతిభ .... ............................... .................... 21
బాబూజీతో అనుభవాలు ............................ 25
హనుమంతుడు....... .................................. 27
ఎవరు అస్పృశ్యుడు? .................................. 29
సంస్మరణ ......................................... ................ 31
కైవల్యోపనిషత్ ... .......................................... 32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు............................ 34
శ్రీబాబు దివ్యవాణి ........................................ 35
ధర్మోపదేశం ................. ................................ 37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39
విష్ణు కథలు ....... .......................... .................. 41

## **దాశరథీ శతకము** - భద్రాచల రామదాసు

**13)** **తరణికులేశ నానుడుల దప్పులు గల్గిన నీదునామ స**
**ద్విరచితమైన కావ్యము పవిత్రముగాదె వియన్న దీజలం**
**బరగుచువంకయైన మలినాకృతి బాఱిన దన్మహత్వముం**
**దరమె గణింప నెవ్వరికి దాశరథీ కరుణాపయోనిధీ!**

భావం - నా మాటలలో తప్పులున్నను నీ పేరుతో వ్రాయబడు కావ్యము పవిత్రమైనదే, ఎట్లన గంగానది నీరు వంకరగ పారిననూ, మురికిగా మారిననూ దాని గొప్పతనమెక్కడికి పోవును? దాశరథీ కరుణాపయోనిధీ!




*ఎటువంటి రాత్రి నిజమైన మహాశివరాత్రి?
*పూజా ద్రవ్యాలలో అన్నిటికంటే ముఖ్యమైనది ఏది?
*ఉపనిషత్తులకు సారభూతమైన రెండు మహావాక్యాలు ఏవి?
*ఉపాసన అంటే ఏమిటి?
*పరమాత్మ సత్య సుందర స్వరూపుడిగా కనబడాలంటే మనలో ఎలాంటి మార్పు రావాలి?
*సుగ్రీవుడు హనుమంతుని పాదపద్మాలను ఎందుకు సేవించాడు?
*సుతీక్ష్ణ మహర్షి ఇంద్రపదవికని ఎందుకు తృణీకరించాడు?
*పికిలిపిట్ట ఎందుకు మరణించింది?

***సమాధానాలు లోపలి పేజీలలో...........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

11-11-1980.

ఈరోజు ఉదయం 9గం.30 ని॥లకు బాబు దర్శనం ఇచ్చినపుడు, క్రితంరోజు విజయవాడలో జరిగిన సత్సంగ సమావేశము గురించి చర్చ వచ్చింది.



"మన సత్సంగ సమావేశము తొందరగా ముగిసింది. చాలామంది వచ్చేసరికి అయిపోయింది. వారు పాపం నిస్పృహ చెందార'న్నారు జాలయ్యగారు. శ్రీ బాబూజీ మాట్లాడుతూ "విజయవాడలో అల్లు రామలింగయ్యగారికి సన్మానసభ వుంది కదండి! అక్కడనుండి వచ్చేసరికి మన సమావేశము అయిపోయింది. నా ఉపన్యాసము ఎక్కువసేపు చెప్తే కూర్చోలేరేమో అని తొందరగా ముగించాను. కాని చాలామంది నేను మాట్లాడుతుంటే తన్మయులై వింటున్నారు" అన్నారు.

ఆ తర్వాత 15,16 తేదీలలో పాందువ్వలో సత్సంగం గురించి చర్చ వచ్చింది. ఈరోజు విశేషం ఏమంటే సత్సంగంలో గురువుగారు, సుగుణమ్మగారు, జయమ్మగారు వచ్చి కూర్చున్నారు. కామేశ్వరమ్మగారు, చంద్రావతిగారు కూడా వచ్చి కూర్చున్నారు. లక్ష్మిగారు కూడా వచ్చారు. శ్రీ బాబూజీ కూర్చోమన్నారు. "పాపం వీళ్ళంతా మనము ఏదన్నా చెప్తే విందామని కూర్చున్నారు. వెంకటరత్నం ఏదన్నా చదవవయ్యా!" అన్నారు శ్రీ బాబూజీ.

"విజయవాడ గుడిలో పురోహితుడు తీర్థంలో కుంకుమ కలిపాడు. అది నేను గ్రహించాను. దానికి తగిన బుద్ధి చెబుదామనుకున్నాను కాని పోనీలే అని వదిలేశాను" అన్నారు శ్రీ బాబు.

విజయవాడ కొత్త గుళ్ళలో రామాలయంలో సీతాదేవి

రామచంద్రుడికి కుడిప్రక్కన ఉంది. అది వైష్ణవ సాంప్రదాయమా? అని అడిగారు వెంకటరత్నంగారు.

శ్రీ బాబూజీ మాట్లాడుతూ "అది నేను గమనించలేదు. రామప్రభూ! నన్ను ఇక్కడికి తీసుకువచ్చావా? అని అనుకొని ఆ ప్రభువుని దర్శిస్తూ తన్మయత్వంలో ఉన్నాను. అమ్మవారిని యథాస్థానంలోనే చూశాను. నాకు అలానే అనిపించింది. శ్రీరామచంద్రుని కుడిప్రక్క ధనుస్సు ధరించిన లక్ష్మణ ప్రభువునే దర్శించాను. అయితే ఇంకొకసారి చూడాలి. చూద్దాం ఎప్పుడు వీలవుతుందో?" అన్నారు.

శ్రీ బాబూజీ ఇంకా మాట్లాడుతూ "నా బుర్ర మట్టిబుర్ర, నాకు తట్టనేలేదు. నాకు ఆ రామనామం తప్ప ఏమీ తెలియదు. మరి నువ్వు ఆగమశాస్త్రకారుడివి కాబట్టి నీకు ఆ లోపం కన్పడింది" అన్నారు శ్రీ బాబు.

నేను ఇదివరలో ఒక ఉపమానం చెప్పాను కదా! "ఒక శిల్పి, స్వర్ణకారుడు, శాస్త్రకారుడు భక్తుడు ఒకేసారి ఒక విగ్రహాన్ని చూస్తే ఏమవుతుంది?. శిల్పి, శిల్ప సౌందర్యాన్ని మాత్రమే చూస్తాడు. స్వర్ణకారుడు ఆ ప్రభువుకు పెట్టిన పచ్చ విలువ ఎంత? కిరీటంలో ఎన్ని డైమండ్స్ వున్నాయి. హస్తములో ఉన్న రత్నం ఎలా ఉంది? అని పరిశీలిస్తాడు. అలాగే శాస్త్రకారుడు ఆగమ శాస్త్రరీత్యా ఎలా ఉంది ఈ దేవాలయం? అని పరిశీలిస్తాడు. కాని భక్తుడు ఆ ప్రభువును దర్శించి తన్మయత్వాన్ని పొందుతాడు. అంతేకానీ ఆ భక్తునికి ఆ శిల్ప సౌందర్యం కాని, రత్నాలు కాని కన్పిస్తాయా? ఆ విగ్రహంలోని చైతన్యమే కన్పిస్తుంది. నీలో సత్త్వ, రజో తమోగుణాలు సత్యం, శివం, సుందరంగా మారిపోతే ఆ ప్రభువు నీకు ఎలా కన్పిస్తాడు? సత్య సుందర రూపుడుగా కన్పిస్తాడు" అన్నారు.

ఇంతలో లలితానంద సరస్వతి స్వాములవారు వచ్చి బాబూజీని 'ఒకసారి లోపలికి వస్తారా?' అన్నారు. ఆ వస్తాను అని బాబూజీ అన్నారు. "చదవవయ్యా వెంకటరత్నం" అన్నారు బాబుజీ.

వెంకటరత్నంగారు చదవటం ప్రారంభించారు. బాబూజీ తిరిగి బోధచేస్తూ "నిరుత్సాహపడకండి. కొబ్బరిచెట్టు ఆకులు రాల్చిన కొలది మాను కడుతుంది. అలానే మీలో సంకల్పాలు రహితం అయినకొలదీ మనస్సు నిలిచిపోతుంది. మూసలో నీరుపోసి ఫ్రిజిడేర్‌లో ఉంచితే

ఏమవుతుంది? ఆనీరు అదే ఆకృతి పొందుతుంది. నీరు అనబడే మనస్సు ఫ్రిజిడేర్ అనబడే ధ్యానము ద్వారా తదాకారాన్ని పొందుతుంది. మన ముందు వడ్డించిన విస్తరి ఉంచుకొని దానికెదురుగా కూర్చుని "నిండు, నిండు" అంటే ఆకలి తీరుతుందా? అదే విశిష్టాద్వైతమంటే. ద్వైతభావన ఉన్నంతవరకు ముక్తిని పొందజాలడు.

చాలామంది అదేవిధంగా యోగభ్రష్టులైనారు. అపరమైనది ఈ జగత్తు, పరమైనది ఆత్మవస్తువు. ఈ రెండింటికి అతీతమై ఈ రెండింటిని ప్రకాశింపజేసే తాను 'నేను' అనే భౌతికమైన అనిశ్చితమైన అహంకారాన్ని వదిలేస్తే మిగిలేది ఏమిటి? అది అసలైన తాను' అన్నారు.

మళ్ళీ బాబూజీని లలితానంద సరస్వతీ స్వాములవారు లోపలికి రమ్మని పిలిచారు. ఈసారి బాబూజీ "హనుమాయమ్మగారూ! పర, అపర తత్త్వము అంటే ఏమిటో చెప్పండి" అన్నారు. 'మీరు ఒకసారి లోపలికి రండి అప్పుడు చెప్తాను' అన్నారు హనుమాయమ్మగారు. బాబూజీ లోపలికి వెళ్ళి తిరిగి బయటికి వస్తూ బజ్జీలు తీసుకొచ్చారు. "ఇవి చాలా బాగుంటాయి, ఆవిడ చాలా బాగా చేస్తుంది" అన్నారు.

హనుమాయమ్మగారిని చూపించి, "ఇవి తినటానికి రమ్మన్నారు నన్ను లోపలికి. ఇంతమంది భక్తులను వదిలి నేను ఎలా తింటాను? మీరంతా తింటే నేను తిన్నట్లే కదా!" అని అందరికి ఆ బజ్జీలు పెట్టారు. "ఆ లోపల ఉన్న లడ్డూలు పట్టుకురండి. అవి ఎన్ని ఉంటాయి. 20 ఉంటాయా? అందరికీ పెట్టండి" అన్నారు బాబూజీ.

ఇంతలో పాపాయమ్మగారు వచ్చారు. ఆవిడకి లడ్డూ ఇచ్చి శ్రీబాబూజీ 'తిను' అన్నారు. "మడికి అడ్డం వస్తుందా?" అని "నా చిన్నతనంలో ఎన్ని అవస్థలు పెట్టిందనుకున్నారు. ఇప్పుడు అంటే నమస్కారం చేసుకుందిగాని" అని, పాపాయమ్మగారివైపు తిరిగి "నాకు నమస్కారం చేసుకుంటే మైలపడిపోతావేమో" అన్నారు. శ్రీ బాబూజీ మళ్ళీ మాట్లాడుతూ, "నాకు విశ్రమించునపుడు తలక్రింద పెట్టుకోటానికి పీట యిచ్చేవారు. నాకు ఒక్కడికి విడిగా భోజనం పెట్టేవారు. నేను తిన్న ప్రదేశం నేనే శుద్ధి చేసుకునేవాడిని. నేను శుద్ధి చేసిన తర్వాత వాళ్ళు శుద్ధి చేసేవారు. నా కంచం, గ్లాసు నేనే తోముకొనేవాడిని. నేను క్షవరం

చేసుకున్న ప్రదేశంలో పసుపునీళ్ళు, ఆవు పంచితం, పేడనీళ్ళు చల్లేవారు. ఇదంతా నిజం! కావాలంటే అడగండి. ఏం పాపాయమ్మా నిజం చెప్పు? వీళ్ళ ఇంట్లో ఉండేవాడిని. కాని నేను ఉన్న గది మినహా నాకు ఏదీ తెలియదు. నేను బల్లమీద విశ్రమించేవాడిని. ఎన్ని అవస్థలు పడ్డానో నా చిన్నతనంలో మీకేమి తెలుసు?" అన్నారు.

ఇంతలో వడాలి పిన్నిగారు వచ్చారు. "పిన్నీ వచ్చావా!" అని మావైపు తిరిగి పిన్నిగారిని చూపుతూ "వీళ్ళకి చాలా ఆచారం. నాకు వీరంతా తిన్న తర్వాత అన్నం పెట్టేవారు. అన్నం తిన్న తర్వాత కంచం, గ్లాసు కడగాలి. పసుపునీళ్ళు చల్లేవారు. నన్ను వీరు తెలుసుకొనని స్థితిలో నన్ను వాళ్ళు రానీయలేదు. ఇప్పుడు తెలుసుకొన్న తర్వాత నేనే వెళ్ళాను.

జగజ్జనని నన్ను ఇక్కడ ఈ విధంగా కరుణించింది. అప్పుడు ఆ విధంగా అనుగ్రహించింది. అదే బాగుంది నాకు. నేను చీకటినుండి వెలుగు చూస్తానని అనుకోలేదు. ఈరోజు నేను చెప్పింది అర్థం చేసుకోండి చాలు" అన్నారు శ్రీ బాబు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా ఆగస్ట్, సెప్టెంబర్ 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***ఆగస్ట్ 2021 :*** AS 6420, 7351, 7352, 7353, 7486, 8345, 8538, 8548.
LM 4272, 4273

***సెప్టెంబర్ 2021 :*** AS 7356, 7363, 8376, 8382 , 8383, 8284
LM 4274, 4275, 4276

# అమ్మమాట

- రమణ ప్రసాద్

## మానస పూజ

ఈ రోజు మనకి గురుపూజ జరిగింది. ఇంతకీ చేసుకున్న వారు గొప్పా? లేక ఎదురుగా కూర్చుని మనస్సు యొక్క భావనని శ్రీ గురు చరణారవిందాలయందు పెట్టడం గొప్పా? శ్రీ గురుదేవులు విజయేశ్వరానంద ప్రసాద్‌వారి ద్వారా మానస పూజను మనకు అందించారు. 'హృదయమె శివ మందిరమని మొదలు తెలియవె మనసా! మాయయను కవాటము ఆ మందిరమును మూసినది................' అని ఈ కీర్తనను మనసారా అనుభవిస్తూ పాడుకుంటే తప్ప అనుభూతి రాదు.



ఆత్మ సర్వ వ్యాపకంగా వుండి కూడా, మన 'హృదయ బాబు'గా మనలోనే వుండి, మన బుద్ధిని ప్రచోదనం చేస్తున్నారు శ్రీగురుదేవులు. మన హృదయ మందిరంలోనే వున్న ఆ మంగళ స్వరూపుడిని మనం ఎందుకు చూడలేకపోతున్నాం? 'మాయ' అనే రెండు గట్టి తలుపులు మన హృదయ మందిరాన్ని మూసివేశాయి. వాటిని తెరవాలంటే మన వల్ల కాదు. అవి కేవలం గురుకృపా ప్రసారం వల్లనే తెరువబడతాయి. అప్పుడు శ్రీగురుదేవులు తమ 'బోధ' అనే దివ్య జ్ఞాన జ్యోతి యొక్క వెలుగులో మన హృదయ మందిరంలో వున్న శివుడిని దర్శింపజేస్తారు.

ఎవరు ఈ దేహంలో వుంటే నువ్వు చైతన్యవంతుడివి అవుతున్నావో, ఆ పరమ శివుడిని ఆర్తితో పిలచి ఆవాహన చేసుకుని, నీ మనసారా ఆ మంగళ స్వరూపుడికి షోడశోపచార పూజ చేసుకోవచ్చు. మన సహస్రార కమలం గురుస్థానం. ఆ దివ్య ఆసనమందు వారిని కూర్చోబెట్టి, భక్తితో ప్రవహించే కన్నీటితో వారి పాదములను కడిగి, అర్ఘ్యం ఇచ్చి, అనురాగమనే అమృతముతో స్వామిని అభిషేకించు. నీ భక్తియనే గంగా జలములతో చేయించే స్నానము స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైనది. భక్తి తన్మయత్వంతో స్వామిని గాఢంగా ఆలింగనం చేసుకోవడమే

ఆయనకి మనం అర్పించే వస్త్రము. శమము, దమము, ఉపరతి, శ్రద్ధ, తితీక్ష, సమాధానము అనే ఆభరణములతో స్వామిని అభిషేకించు. ఇప్పుడు నీ హృదయ పీఠంపై ఆశీనులయి వున్న గురుదేవుని దివ్య నామములతో పూజించు. ఈ పూజకు ఇన్ని పూలు తేవాలి అని లేదు. డబ్బు ఖర్చు అసలే లేదు. అయితే ఒక్కటి వుంది. ఈ పూజకు కావలసిన ధనం భక్తి ధనం, ఇంద్రియ నిగ్రహం అనే మడి కావాలి.

నీలోని జన్మ జన్మాంతర వాసనలని అగరు వత్తులుగా చేసి, ధూపం వేయి; జ్ఞానమనే జ్యోతి వెలుగులో స్వామిని దర్శించు. నీలోని కామ, క్రోధాది గుణములు, అహంకార మమకారములను స్వామికి నివేదన చేస్తే, ఆయన హాయిగా వాటిని ఆరగించి, నీకు మనశ్శాంతిని ప్రసాదిస్తాడు. నీలోని సకల వాంఛలను, ఆశలను కర్పూర హారతిగా వెలిగించు.

ఆ సద్గురుడే విరాట్‌పురుషుడని మంత్రపుష్పాన్ని సమర్పించి, నీ సకలేంద్రియములను సమర్పణ చేసి, స్వామికి నమస్కారం చేసుకో. తిరిగి స్వామివారి దృష్టిలో నీ దృష్టిని నిలిపి చూడు. స్వామి నీకు 'రక్ష' నిస్తారు. అప్పుడిక నీవు, స్వామి, జగత్తు సర్వము శివస్వరూపముగా నీకు దర్శనమయి, అనుభూతిని ప్రసాదిస్తుంది. నానాత్వం నశిస్తుంది. **సమం ఏకం బ్రహ్మ** అని అనుభవ పూర్వకంగా తెలుసుకుంటావు.

ఇప్పుడు చెప్పండి, యాంత్రికంగా చేసే బాహ్యపూజ గొప్పదా, సర్వ సమర్పణ భావంతో, భక్తితో చేసే మానసిక పూజ గొప్పదా? ఈ మానసిక పూజకు ఆడంబరాలు, ఆర్భాటాలు, డబ్బుఖర్చు లేవు. కానీ నిశ్చల భక్తి అనే ఒక్కటుండాలి.

అటువంటి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి శ్రీ గురుపాదుకలు సర్వదా కాపాడు గాక! సుఖీభవ! సుఖీభవ!!

# అగస్త్య హృదయం

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

(గత సంచిక తరువాయి)

**సర్వదేవాత్మకోహ్యేషా తేజస్వీ రశ్మిభావనః**
**ఏష దేవాసుర గణాన్ లోకాన్‌పాతిగభస్తిభిః ॥**

ఈయనే సర్వదేవాత్మకుడై తేజోరాశిగా విరాజిల్లుతూ, తన కిరణములతో దేవాసుర గణములను, సమస్త లోకములను కాపాడువాడు.

ఈ శ్లోకం సూర్యభగవానుని ప్రత్యక్ష పరమాత్మరూపముగా తెలియజేస్తోంది. 'పూజయస్వ' అని ముందు శ్లోకములో ఆదేశించిన అగస్త్యులు ఆ పూజకు ఆధారభూతమైన పరమాత్మ స్వరూపంలో ఆదిత్యుని ఈ శ్లోకంలో ఆవిష్కరిస్తున్నారు. సర్వాంతర్యామి అయిన ఈశ్వరుడు సర్వదేవతలకు ప్రతిరూపమై ప్రత్యక్షంగా సూర్యునిగా దర్శనమిస్తాడు. మన వేదాలు పురాణాలలో కూడా ప్రతి దేవతనూ ఆదిత్యుని రూపంలో కొలవాలని తెలుపబడింది. శ్రీమద్భాగవతములో సూర్యుని నారాయణుని ప్రతిరూపంగా అభివర్ణిస్తూ, **ఏక ఏవహి లోకానాం సూర్య ఆత్మాదికృత్ హరిః** అని సర్వదేవాత్మకత గురించి చెప్పబడింది. శ్రీ రుద్ర పారాయణ సంకల్పంలో కూడా **యోఽసావాదిత్యః పరమ పురుషః సఏష రుద్రో దేవతా** అంటూ ఎదురుగా కనిపిస్తున్న ఆదిత్యుడే పరమ పురుషుడైన రుద్రుని ప్రతిరూపం అని చెప్పబడింది. ఆ విధంగా అగస్త్యులు శ్రీరామునికి వివరిస్తూ ఏష - ఈయనే ఆ పరమాత్మ స్వరూపమని విశదీకరిస్తున్నారు. ఏష అంటూ ఎదురుగా చూపించడము కేవలం ఆదిత్యుని సందర్భంలోనే సాధ్యం అవుతుంది. ఈ శ్లోకం మొదలుకుని పలుమార్లు అగస్త్యులు ఏష అని సంబోధించడం మనం గమనించవచ్చు. అయితే సాధకుడు చర్మ చక్షువులతో సూర్యుని దర్శించడంతోనే ఆగిపోకుండా, అంతర్ముఖుడై హృదయాంతర్వర్తియైన గురుమూర్తిని (హృదయ బాబుని) దర్శించ గలగాలి.

**అప్రత్యక్షో మహాదేవః సర్వేషాం ఆత్మమాయయా**
**ప్రత్యక్షో గురురూపేణ వర్తతే భక్తి సిద్ధయే ॥**

అన్న శ్లోకంలో వివరింపబడినట్లు అప్రత్యక్షంగా వున్న ఈశ్వరుడే ప్రత్యక్షమైన గురుమూర్తి రూపంలో లభిస్తాడు. ఎన్నో జన్మల పుణ్యఫలం

రాశీభూతమైనప్పుడు మాత్రమే అది సాధ్యమని శ్రీబాబూజీ శలవిచ్చారు. భక్తి సిద్ధించి, గురుపాద సమాశ్రయం పొందిన తరువాత విశ్వాసాన్ని ఆరూఢం చేసుకోవడం సాధకుడి కర్తవ్యం. ఈ శ్లోకంలో ప్రత్యక్ష పరమాత్మ యైన గురుమూర్తియే సర్వదేవాత్మకుడైన ఆదిత్యుని చూపించడంతో పాటుగా, **త్వమేవాఽహం** అన్న మహావాక్య నిర్వచనమును గుహ్యంగా అందిస్తున్నారు. గురువే గోవిందుని చూపిస్తున్న ఘట్టముతో పాటు, వారిద్దరి మధ్య అభేద స్థితిని ఈ శ్లోకం తలపిస్తుంది. మరి కబీర్‌దాసు గురువు, గోవిందుడు ఇద్దరూ ఎదురైతే ప్రథమ నమస్కారం గోవిందుని తెలియజేసిన గురువుకే అని ఘంటాపథంగా తెలిపారు కదా!

**తేజస్వీ రశ్మిభావనః** అన్న ప్రస్తావన తేజోరూపమైన సూర్యుడు జగమంతా కాంతులు నింపుతున్నాడని వివరిస్తోంది. ఆ కిరణములతోనే ఆయన దేవాసురగణములను, సమస్త లోకములను కాపాడుతున్నాడు. ఆ తేజోరూపమునే గురు రూపముగా గుర్తించి, సద్గురుదేవులను **ఓం తేజస్వినే నమః** అని స్తుతించుకుంటున్నాము. మరి ఆయన తేజస్సే మనలో అంతర్లీనంగా నలుదిశలా వ్యాప్తి చెంది, ఆపాదమస్తకమూ చైతన్యంగా ప్రకాశిస్తోంది. ఇదే అంశాన్ని వివరిస్తూ మంత్రపుష్పంలో చెప్పబడిన **తిర్యగూర్ధ్వమధశ్శాయీ రశ్మయస్తస్య సన్తతః సన్తాపయతి స్వం దేహమాపాదతలమస్తకః** - అనే మంత్రంలో **తస్య రశ్మయః** - ఆయన యొక్క కిరణకాంతి అన్నది గురుమూర్తి యొక్క ప్రకాశమే.

సూర్యుని తేజస్సు కాంతిని ఇవ్వగలదు కానీ, మరియొక సూర్యుని సృష్టించలేదు. కాని గురుశక్తి సాధకుని కూడా తేజోవంతునిగా తీర్చిదిద్ద గలదు. దీనిని వివరిస్తూ శ్రీబాబూజీ 'పరశువేది ఇనుమును బంగారంగా మార్చగలదు కానీ, మరొక పరశువేదిని తయారు చేయలేదు. కానీ, సద్గురుదేవులు నీలో వున్న పరమాత్మను దర్శింపజేసి, నిన్ను తమంతటివాడిని చేయగల సమర్థుల'ని శలవిచ్చారు. అలాంటి తేజో రూపులుగా మనందరినీ తీర్చిదిద్దగల సద్గురుదేవులను మనం భక్తిగా **తేజస్కరాయ నమః** అని పిలుచుకుంటున్నాము. ఈ విధంగా సర్వాధిష్ఠాన చైతన్యమైన గురుపరమాత్మను సాధకులందరూ అంతర్ముఖంగా దర్శించాలని ఈ శ్లోకం యొక్క అంతరార్థము.

- సశేషం

# దృఢమైన భక్తి

- భోగరాజు భారతి

నడిచే దైవం కంచి కామకోటి పీఠాధిపతి పరమాచార్య శ్రీశ్రీశ్రీ చంద్రశేఖర సరస్వతీస్వామి వారిని చూసిన భక్తుడు చెప్పిన సంఘటన

..........................................................................

స్వామివారు ఒకప్పుడు పాదయాత్ర చేస్తూ ఒక కుగ్రామం చేరుకున్నారు. అక్కడ వున్న శివాలయం ప్రక్కనే వున్న ఒక సామాన్యుని ఇంట్లో బస చేశారు.

తెల్లవారుజామున ఆలయంలో స్వామికి పూజచేసుకోవడానికి బిల్వదళాలు కావాలన్నారు. కానీ వారంతా అమాయక ప్రజలు వారికేమీ తెలియదు. అక్కడే వున్న ఒక పశువుల కాపరి అది విని నేను తెస్తానని పరుగెత్తుకుంటూ వెళ్ళి బుట్టనిండా దళాలు తెచ్చాడు.

స్వామిపూజ చేసుకుని బయటకు వస్తుంటే వారి దారికి అడ్డంగా పడుకున్నాడు. స్వామి, 'నీకేమి కావాలిరా?' అని అడిగారు. వాడు 'నాకు మోక్షం కావాలి' అన్నాడు.

స్వామి ఒక్క నిమిషం ఆలోచించి, 'ఆ అమ్మవారిని అడిగి ఆమె ఏది చేయమంటే అది చేద్దాం' అన్నారు. తిరిగి ఆ స్వామి వెళ్ళిపోయారు. ఎన్నో సంవత్సరాల తరువాత ఆ కుఱ్ఱవాడి తల్లిదండ్రులు 'వాడు చావుబ్రతుకుల్లో వున్నాడు, వాడితో ఏమి చెప్పమంటారు?' అని టెలిగ్రాం ఇచ్చారు స్వామికి.

స్వామివారు సమాధానంగా 'జగన్మాత నీకు 3 జన్మలలో తప్పక మోక్షం వస్తుందని చెప్పింది. ఈ జన్మ అయిపోవడం మంచిదే' అని చెప్పారు.

మహాత్ములు చెప్పిన వాక్యం తప్పక ఫలిస్తుంది కదా! ఆ కుఱ్ఱవాడి మూఢ భక్తి, విశ్వాసం అటువంటివి. ఈ సంఘటన చెప్పిన వ్యక్తి స్వామిని స్వయంగా చూశారట.

# వేదాలు - ఉపనిషత్తులు

- ఎన్. కుట్టీ

వేదాలను రెండు భాగాలుగా విభజించారు. అవి .... 1. వేదాలకు పూర్వభాగం, 2. వేదాలకు అంతిమ భాగం. పూర్వభాగాన్ని కర్మకాండ అని, అంతిమ భాగాన్ని జ్ఞానకాండ అని కూడా అంటారు. 'వేదానాం అంతః' వేదాంతం అన్నారు. ఉపనిషత్తులు కూడా ఈ వేదాల నుండే వచ్చాయి. ఉపనిషత్తులలో వాడిన వాటిని మంత్రాలు అంటారు.

ఉపనిషత్తు అంటే తన సహజ స్థితిని తెలుసుకోవడం. ఈ ఉపనిషత్తుకు  కూడా అనేక పేర్లు వున్నాయి. అవి.... బ్రహ్మవిద్య, పూర్ణ విద్య, నిఃశ్రేయస విద్య మరియు ఆత్మ విద్య అని. ఉపనిషత్ అనగా ఉప అంటే సమీపంలో ని అంటే క్రింద, షత్ అంటే కూర్చోవడం అని అర్థం. అనగా సద్గురువు సమీపంలో కూర్చోవడం అని అర్థం. మొత్తం ఉపనిషత్తులు 1180 అని కొందరు, 108 అని కొందరు తెలియజేశారు. ఇన్నింటిని గురించి తెలుసుకోవడం కష్టమని, 10 ప్రధాన ఉపనిషత్తులను తీసుకుని, వాటికి 'దశోపనిషత్' అని పేరు పెట్టారు. అవి...

1. కఠోపనిషత్, 2. ఈశావాశ్యోపనిషత్, 3. మాండూక్యోపనిషత్, 4. ముండకోపనిషత్, 5. తైత్తరీయోపనిషత్, 6. ఐతరీయోపనిషత్, 7. ఛాందోగ్యోపనిషత్, 8. బృహదారణ్యకోపనిషత్, 9. కేనోపనిషత్, 10. ప్రశ్నోపనిషత్. ఒక్కొక్క ఉపనిషత్‌కి కొన్ని శాఖలు వున్నాయి.

ఈ ఉపనిషత్తులకు పేర్లు ఎలా వచ్చాయి? వీటిని మనకు ఎవరు ప్రసాదించారు?

భగవద్గీత కూడా ఉపనిషత్తే. శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో స్వయాన అర్జునునకు ఆత్మబోధ చేశారు. వేదాలను స్వయంగా శ్రీమన్నారాయణ మూర్తి ప్రసాదించారు. చాలామందికి వేదాలు ఎలా వచ్చాయో తెలియక, ఏ యోగి పుంగవులో మనకిచ్చారు అని అనుకుంటారు. కానీ, స్వయంగా భగవానుడే అందించాడు. వేదాలు చాలా పురాతనకాలం నాటివి.

ఈ వేదాలు 'విద్' అనే ధాతువు నుండి వచ్చాయి. విద్ అంటే తెలుపబడటం అని అర్థం. వేద జ్ఞానం కలిగినవారిని ద్రష్టలు అంటారు. ఈ వేదాలను అపౌరుష్యాలు అని కూడా అంటారు. ద్రష్ట అంటే భగవంతుని దర్శించినవారు అని అర్థం.

వేదాలను శృతులు అని కూడా అంటారు. శృతి అంటే సద్గురువు చెప్పినది చెప్పినట్లు చెప్పడం. వేదాలను స్వాధ్యాయనం అని కూడా అంటారు. వేదాలను నాలుగు రకాలుగా విభజించారు. అవి..1 ఋగ్వేదము, 2 యజుర్వేదము, 3 సామవేదము, 4 అధర్వణవేదము. ఋగ్, యజు మరియు సామ వేదాలను కలిపి త్రయీ అంటారు.

ఉపనిషత్తులు వేదాల నుండి వచ్చాయి. ఈ ఉపనిషత్తులను వ్యాప్తిచేసి అందరికీ తెలియజేశాడు బ్రహ్మ. అందుకే వీటిని బ్రహ్మవిద్య అని కూడా అంటారు. ఈ వేదాలన్ని చిందరవందరగా పడి వుంటే వ్యాసమహర్షి వీటిని ఒక పక్కకు చేర్చి, ఋక్కులన్నీ ఋక్ సంహితగా, యజుస్సులన్నిటినీ యజు సంహితగా, సామాలన్నీ సామ సంహితగా, అధ్వరణాలన్నీ అధ్వరణ సంహితగా సమకూర్చారు. అందువలననే వ్యాసమహర్షికి వేదవ్యాసుడు అనే పేరు వచ్చింది.

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

***** ప్రతి గురువారము అన్నార్తులకు, సాధువులకు అన్నదానం జరుగును*

**ఆగస్ట్ 2021**

2 సోమ - శ్రీగురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

22 ఆది - శ్రావణ పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ

30 సోమ - శ్రీకృష్ణాష్టమి - శ్రీ సద్గురు పాదపూజ.

**సెప్టెంబర్ 2021**-

1 బుధ - శ్రీగురుదశమి - శ్రీ సద్గురు పాదపూజ

10 శుక్ర - వినాయక చవితి - శ్రీ సద్గురు పాదపూజ.

20 సోమ - భాద్రపద పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ.

# ఛాందోగ్యోపనిషత్ సారము

-సుషుమ్నా ప్రసాద

ఛాందోగ్యోపనిషత్ 9వ ఉపనిషత్తు. ఐతరేయ ఉపనిషత్తు తరువాత వస్తుంది. ఛందోగాః అంటే సామవేదం గానం చేసే మహర్షులు. వారు ప్రచారం చేసినది కాబట్టి దీనికి ఛాందోగ్యోపనిషత్ అని పేరు వచ్చింది. ఛాందోగ్యము, దీని తరువాత వచ్చే బృహదారణ్యకోపనిషత్ చాలా విశేషమైనవి. ఈ విశిష్ఠత కేవలం పరిమాణంలో లేదు. గుణంలో విశిష్ఠత. ఉపనిషత్ వాఙ్మయానికంతటికీ సారభూతమైన రెండు మహావాక్యాలు వున్నాయి. ఆ రెండింటిలో ఒకటి **'తత్త్వమసి'** మరొకటి **'అహం బ్రహ్మాస్మి'**. ఇందులో తత్త్వమసిని ఉపదేశ వాక్యంగానూ, అహం బ్రహ్మాస్మిని అనుభవ వాక్యంగానూ పరిగణిస్తాము. ఈ రెండింటితో వేదాంత శాస్త్ర ప్రమేయమంతా పరిసమాప్తం అవుతుంది. అందుచేత ఈ రెండు ఉపనిషత్తులను విశిష్ఠమైనవిగా పరిగణిస్తాము.

ఛాందోగ్యోపనిషత్ ఉపదేశ ప్రధానమని చెబుతారు. తత్త్వమసి మహావాక్యమే ఆ ఉపదేశం. అది ఒక్కసారిగా బోధిస్తే సాధకునకు అవగాహన కావడం కష్టం. సాధకులనే వారిని మూడు రకములుగా విభజించవచ్చు. మొదటివారు ఉత్తమాధికారులు. రెండవ వర్గంవారు మధ్యమాధికారులు. మరికొంతమంది మందాధికారులు.

ఉత్తమాధికారికి వాక్యార్థము వెంటనే బోధపడుతుంది. మధ్యమాధికారులకు అంత సులభంగా మనస్సుకు రాదు. వారి మనసులకు నచ్చేవి రెండే మార్గాలు అవి కర్మ, ఉపాసన. అందుచేతనే ఈ రెండింటిని గూర్చి ఈ ఉపనిషత్ మొదట చర్చిస్తుంది. కానీ, ఈ చర్చించడము వాటినే గమ్యముగా భావించమని చెప్పడానికి కాదు. లక్ష్యార్థ జ్ఞానమే ఎప్పటికైనా జీవిత గమ్యం. ఆ గమ్యాన్ని చేరడానికి ఇది కేవలం భూమికలుగా మాత్రమేనని బోధిస్తున్నదీ ఉపనిషత్తు.

అది ఎలాగని ప్రశ్నించవచ్చు. వేదబోధితమైన కర్మలన్నీ రెండు విధాలు. కేవల కర్మలు కొన్ని. విద్యాసహితమైనవి కొన్ని. ఈ విద్యాసహిత కర్మలకే ఉపాసన అని పేరు. ఉపాసన అంటే శాస్త్రం చెప్పిన ఒక ఆలంబనాన్ని పట్టుకుని ఇతర చింతనలు లేకుండా దానిమీదనే మనస్సు లగ్నం చేసి ఏకాగ్రతతో చింతిస్తూ పోవడం. ఇది సాధకునకు కేవలకర్మ

కన్నా ఎక్కువ ఫలితాన్నిస్తుంది. **యదేవ విద్యయా కరోతి శ్రద్ధయోపనిషదా తదేవ వీర్యవత్తరమ్ భవతి** - అంటున్నది ఉపనిషత్. అజ్ఞానంతో చేసినదానికంటే జ్ఞానంతో చేసిన దానికి అధికఫలం వుంటుంది.

ఈ ఉపాసన మూడు స్థాయిలు వున్నాయి. 1. కర్మాంగోపాసన, 2. దేవతోపాసన, 3. సగుణబ్రహ్మోపాసన.

కర్మోపాసన అంటే మనం చేసే కర్మలకు ఉపయుక్తమైన వాటికి ఒక సమగ్రతను చేకూర్చేవి. ఉద్గీధాదులైన ఉపాసనలన్నీ ఈ కోవకు చెందినవే.

దేవతోపాసన అంటే ఆదిత్యుడని, హిరణ్యగర్భుడని ఇలాంటి దేవతా మూర్తులను మనస్సులో ధ్యానిస్తూ మంత్రపూర్వకంగా హోమాది కర్మలను నిర్వర్తించడము. ఇందువలన సాధకునకు ఆ యా దేవతలతో సాయుజ్యం లభిస్తుంది. **యథా క్రతురస్మిన్ లోకే పురుషోభవతి తథేతః ప్రేత్య భవతి** - అని ఉపనిషత్. అంటే అర్థం క్రతువు అంటే మనోనిశ్చయము. మానవుడు ఇహంలో ఎలాంటి ఉపాసన సాగిస్తాడో దానికి అనుగుణంగానే ఆ యా దేవతా మూర్తుల వద్దకు చేరుతాడు. దేవతలంటే ఎవరో కాదు. ఈశ్వర చైతన్యమైన అనుభూతులే. అనేక శక్తి సంపన్నమైన ఆ చైతన్య సాగరంలో ఏ ఒక్క చైతన్య శక్తి తరంగాన్ని మనం ఆశ్రయించినా అది మనకు అందుకు తగ్గ ఫలితాన్నిస్తుంది. ఇది దేవతోపాసన.

మూడవది సగుణబ్రహ్మోపాసన. ఇది అగ్ని, ఆదిత్యులనే చిల్లర దేవతలను కాకుండా బ్రహ్మతత్వమనే పెద్ద దేవతనే ఆరాధిస్తూ పోవడం. అయితే బ్రహ్మమనేది అపరిచ్ఛిన్నం (అవధులు లేనిది). దానికి గుణాలు లేవు. గుణాలు లేకపోతే అది ఉపాసకుని మనసుకు రాదు. అందుచేత దానిని సగుణంగా భావన చేస్తాడు సాధకుడు.

- సశేషం


## పాఠకులకు విజ్ఞప్తి

సమర్థ సద్గురు మాసపత్రికలో ప్రచురితమయ్యే వ్యాసాలను రోజుకు ఒకటి చొప్పున సులువుగా చదువుకొనుటకు టెలిగ్రాం ఛానల్ ప్రారంభించబడినది. ఈ ఛానల్‌లో చేరుటకు మీ చందా నంబరును టెలిగ్రాం యాప్ ద్వారా 83338 08310 కు పంపవలెను.

# ఏడు చేపల కథ

సేకరణ- జపమాలా ప్రసాద

చిన్న పిల్లలకి పెద్దలు చెప్పే కథ, 'రాజుగారికి ఏడుగురు కొడుకులు - వేటకు వెళ్ళి ఏడు చేపలు తేవడం' చిన్న పిల్లలకు ఎంతో పరిచయం వున్న కథ, మళ్ళీ మళ్ళీ అడిగి చెప్పించుకునే కథ. ఈ కథలోని వేదాంత తాత్వికత, పరమార్థం - అనగనగా ఒక రాజు, ఆ రాజుకు ఏడుగురు కొడుకులు. ఏడుగురు కొడుకులూ ఒకసారి వేటకు వెళ్ళి ఏడు చేపలను వేటాడారు. వేటాడిన చేపలను ఎండబెట్టారు. అందులో ఒక చేప ఎండలేదు. చేపా! చేపా! ఎందుకు ఎండలేదు? అని అడిగారు. గడ్డిమేటు అడ్డువచ్చింది అన్నది. గడ్డిమేటూ! గడ్డిమేటూ! ఎందుకు అడ్డు వచ్చావు? అని అడిగారు. ఆవు నన్ను మేయలేదు అన్నది. ఆవూ! ఆవూ! ఎందుకు మేయలేదు? అన్నారు. గొల్లవాడు నన్ను మేపలేదు అన్నది. గొల్లవాడా! గొల్లవాడా! ఎందుకు మేపలేదు? అని అడిగారు. అమ్మ అన్నం పెట్టలేదు అన్నాడు. అమ్మా! అమ్మా! ఎందుకు అన్నం పెట్టలేదు? అని అడిగారు. పిల్లవాడు ఏడ్చాడు అన్నది. పిల్లవాడా! పిల్లవాడా! ఎందుకు ఏడ్చావు? అని అడిగారు. చీమ కుట్టింది అన్నాడు. చీమా! చీమా! ఎందుకు కుట్టావు? అని అడిగారు. నా బంగారు పుట్టలో వేలు పెడితే కుట్టనా? అన్నది.

ఎన్నో అసహజాలు, అసంగతాలు అయిన సన్నివేశాలూ వున్నా, కారణాలు అడగకుండా, ఆలోచించకుండా, చెప్పే, వినే గొప్ప తెలుగు కథ ఈ ఏడు చేపల కథ. నిజానికి రాజుగారి కొడుకులకు చేపలు వేటాడాలసిన కర్మ ఏం పట్టింది? అడవికి పోయి క్రూర మృగాలను వేటాడవచ్చు కదా! అని ఎవరూ తర్కించరు. మీరు చెప్పినప్పుడు మీరూ ఆలోచించరు. చెరువుకు పోయి చేపలు తెచ్చారే అనుకుందాం. వాటిని ఎండబెట్టటానికి, ఎండినవాటిని ఎత్తిపోసుకోవడానికి వారి దివానంలో నౌకర్లు కరువయ్యారా! అనే సందేహం కూడా రాదు. ఎవరూ అడగలేదు కదా అని వివరించకపోవడం విజ్ఞుల లక్షణం కాదట. అందుకే ఈ కథను జాగ్రత్తగా గమనించమంటున్నారు. అలా గమనిస్తే అనేక అంతరార్థాలు, పైకి కనిపించని విశేషాలు స్ఫురిస్తాయి.

రాజుగారు అంటే మనిషి. ఆయనకు ఏడుగురు కొడుకులు

అంటే మనిషిలోని సప్తధాతువులు. కొడుకులు వేటకు వెళ్ళడమంటే మనిషి జీవితాన్ని కొనసాగించడం. జీవితమే ఒక వేట. రాజకుమారులు వేటాడిన ఏడు చేపలు అంటే, మనిషికి వుండే అరిషడ్వర్గాలు : 1 కామ, 2 క్రోధ, 3 లోభ, 4 మోహ, 5 మద, 6 మాత్సర్యాలు. వీటన్నింటినీ మనిషి సాధన చేసి ఎండగట్టవచ్చు. అంటే పూర్తిగా నియంత్రించవచ్చు. అందుకే కథలో ఆరు చేపలను ఎండకట్టినట్టు చెప్పారు. రాజుగారి కొడుకులు ఎండబెట్టిన ఏడు చేపలలో ఒక చేప ఎండలేదు. ఏమిటా చేప?

అది మనస్సు. దీన్ని జయించడం చాలా కష్టం. ఎంత ప్రయత్నించినా అది ఎండదు. మనస్సు అంటే ఏమిటి? మనస్సు అంటే సంకల్ప వికల్పాలు. ఒకటి తీరుతుంటే మరొకటి మొలుచుకొస్తుంది. మొలిచే కోరికలను తీర్చుకుంటూ పోతుంటే జీవితకాలం చాలదు. కోరికలన్నింటినీ జయించి, మోక్షానికి వెళ్ళిపోవాలని, ప్రతి ఒక్కరూ ఆరాటపడుతూ వుంటారు. మోక్షానికి వెళ్ళాలనుకోవడం కూడా ఒక కోరికే. ఆ కోరికను ఎండగడితే తప్ప మోక్షం రాదు. ఈ చేప ఎండకుండా అడ్డు తగులుతున్నది ఏమిటి? గడ్డిమేటు. గడ్డిమేటు అంటే ఏమిటి? కుప్పపోసిన అజ్ఞానం. గడ్డిమేటులాగా పేరుకుపోయిన అజ్ఞానాన్ని తొలగించాలంటే ఎలా? మామూలు గడ్డికుప్ప అయితే, గడ్డి పరకలు పట్టి లాగీ, పీకి ఒకనాటికి ఖాళీ చేయవచ్చు. కానీ, అజ్ఞానం అలాంటిది కాదు. జ్ఞానదాయకమైన మాటలు ఎంత చెప్పినా, ఎన్నిసార్లు చెప్పినా, మనం చేత్తో గడ్డిపరకలు లాగినట్లే! ఆ కుప్ప తరిగేది కాదు, తగ్గేది కాదు. దాన్ని ఎంత ప్రయత్నించినా తగ్గించడం కష్టం.

మరి అది పోవాలంటే ఏం చెయ్యాలి? ఆవు వచ్చి మేయాలి. ఆవు ఎక్కడి నుండి రావాలి? అసలు ఆవు అంటే ఏమిటి? ఆవు అంటే జ్ఞానం. జ్ఞానమనే ఆవు దొడ్లో ఎగబడి మేస్తే, అజ్ఞానమనే గడ్డికుప్ప ఒకనాటికి అంతరించిపోతుంది. లేదూ, జ్ఞానాన్ని అగ్నికణంగా మార్చి గడ్డిమేటు మీద వేస్తే కాలి బూడిద అవుతుంది. అందుకే భగవద్గీతలో మన కర్మలూ, వాటి ఫలితాలూ జ్ఞానాగ్నిలో దగ్ధమైపోవాలని చెబుతాడు కృష్ణుడు. (జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణి) జ్ఞానాన్ని అగ్నిగా మలుచుకోగలిగినవాడు సిద్ధ పురుషుడు, యోగపురుషుడు మాత్రమే. ఈ గోవును ఎవరు

మేపాలి? గొల్లవాడు మేపాలి. గొల్లవాడంటే ఎవరు? సమర్థ సద్గురువు, జగద్గురువు. జ్ఞానరూపమైన భగవద్గీతను లోకానికి ప్రసాదించిన కృష్ణుడు గొల్లవాడే కదా! అర్జునుడు అనే దూడను అడ్డుపెట్టుకుని, వేదాంతమనే ఆవుపాలు పితికి, జ్ఞానరూపంగా మనందరికీ ధారపోశాడు. ఇంత గొప్పపని చేయవలసిన ఈ గొల్లవాడు ఆ పని చేయలేదు. ఏమిరా నాయనా! ఆవును ఎందుకు మేపలేదు? అని అడిగితే. అమ్మ అన్నం పెట్టలేదు అన్నాడు. ఇంతకీ ఆ గొల్లవాడికి అన్నం పెట్టాల్సిన అమ్మ ఎవరు? అమ్మలగన్నయమ్మ ముగురమ్మల మూలపుటమ్మ చాల పెద్దమ్మ. ఆమెనే లోకం జగన్మాత అని కీర్తిస్తుంది. ఈ జగన్మాత అన్నం పెట్టకపోవడం వలన గొల్లవాడి ఆకలి తీరలేదు. ఓ జగన్మాతా! ఈ గొల్లవాడికి ఎందుకు అన్నం పెట్టలేదమ్మా? అంటే, ఆవిడ పిల్లవాడు ఏడ్చాడు అన్నది. ఇంతకీ ఆ పిల్లవాడు ఎవరు? ఆర్తితో దైవానుగ్రహం కోసం అలమటించేవాడు. ఈ పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడు? వాడికి చీమ కుట్టింది. ఎక్కడిదీ చీమ? దానికి ఇంకోపేరే సంసారం. సంసారమనే చీమ కుట్టినందుకు ఆ పిల్లవాడు ఏడుస్తున్నాడు. ఆవులను మేపడానికి వచ్చే గొల్లవాడికన్నా, ఆర్తితో దైవానుగ్రహం కోసం ఏడ్చే పిల్లవాడే ముఖ్యం కనుక ఆ పిల్లవాడినే చూసుకుంది. మరి గొల్లవాడు అమ్మ అన్నం పెట్టక పోవడం వలన తన విధిని నిలిపివేశాడా? లేదు. అమ్మ ద్వారా తన పనిలో భాగమైన శిష్ట రక్షణను చేసుకున్నాడు.

చీమ కుట్టినందుకు కథలో పిల్లవాడు ఏడ్చినట్లే, సంసార బాధలు, ప్రపంచ బాధలు భరించలేక మనం కూడా ఏడుస్తున్నాము. మనలను ఈ బాధలే చీమలై కుడుతున్నాయి. చీమలు పుట్టలోనే వుంటాయి. ఏమిటీ పుట్ట? మనిషికి వుండే సంసారమే ఒక పుట్ట. చీమ దానంతటది కుట్టలేదు. పిల్లవాడు పుట్టలో వేలు పెడితేనే కుట్టింది. అలాగే సంసారం మనలను పట్టుకునిలేదు. మనమే దానిని పట్టుకుని అది కుట్టిందని ఏడుస్తున్నాము. ఈ పరమార్థాన్ని చెప్పడం కోసమే, జీవితంలోకి అడుగు పెట్టే ముందే ఈ గొప్ప విషయం తెలియాలని సదుద్దేశంతోనే మన పెద్దలు ఈ కథను ప్రతి పిల్లవాడికీ నూరిపోశారు.


ప్రతిభ
మధుప
గురుదేవా! నేను కామేశ్వరమ్మగారి లాగా పాడలేను, వెంకట రత్నంగారి లాగా వ్రాయలేను.
1


లాల్ గారి లాగా అన్నీ గుర్తు పెట్టుకోలేను. మరి నేను భగవంతుడి సేవ ఎలా చేసుకోవాలి?
2


నాయనా! నీకొక కథ
చెబుతాను విను.
పూర్వం ఒక అడవిలో ఒక
పిగిలిపిట్ట ఉండేది.
3


అది ఒక రోజు నెమలి పిట్ట
పెద్ద గుడ్డు పెట్టడం
చూసింది.
4


నేను కూడా ఎలాగైనా
ఆ నెమలి లాగా పే...ద్ద
గుడ్డు పెట్టాలి.
5


అలా అనుకొని ఆ పిగిలిపిట్ట ఇంకా
ఇంకా పెద్దగా ముక్కడం
మొదలుపెట్టింది.
6


అలా ముక్కి ముక్కి చివరికి
అది పొట్ట పగిలి చచ్చింది.
7


భగవంతుడు ప్రతి
ప్రాణిని ఏదో ఒక
ప్రయోజనం కోసం
సృష్టించాడు. అలాగే
ప్రతి ప్రాణికి ఒక్కొక్క
ప్రతిభను ఇచ్చాడు.
నీ ప్రతిభను గుర్తించి
దానిని ఇంకా ఇంకా
మెరుగు పరచుకొని
నీ జీవిత
ప్రయోజనాన్ని
సాధించడం ద్వారా
భగవంతుని సేవ
చేసుకోవాలి కానీ
ఇతరులతో పోటీ
పడి ప్రయోజనం
లేదు.
8

# బాబూజీ తో అనుభవాలు

(గత సంచిక తరువాయి)

-వి. లక్ష్మీ నరసమాంబ

## క్రొత్త ఇంటి గృహ ప్రవేశం

అది 2014 సవంత్సరం అనుకుంటా ..... హైదరాబాద్ ఆశ్రమ అప్పటి కార్యదర్శి అయిన జగదీశ్వర్‌గారు ఒక సత్సంగ సమావేశ అనంతరం - బేగం పేటలోని తమ ఇంటి గృహప్రవేశం మాతాజీగారే స్వయంగా దగ్గర వుండి జరిపిస్తున్నారు. అందరూ ఆహ్వానితులే! అని చెప్పడం జరిగింది. అది వినగానే మూసాపేటలో మా కొడుకు కూడా ఇల్లు కొనుక్కున్నాడు. అది కూడా గృహప్రవేశానికి దగ్గరగా వుంది. కానీ, దానిని మాతాజీ చేతుల మీదుగా జరిపించే భాగ్యం నాకు లేదు కదా అని మనస్సులో బాధపడ్డాను. ఎందుకంటే నా కొడుకు, కోడలు నా విశ్వాసానికి దూరంగా వున్నారు. వారితో ఆ ఇంటి గృహప్రవేశం గురించి ఏమీ సంప్రదించలేదు. అయితే, నేను ఏమీ చేయలేక పోయానే అన్న బాధ నాలో వుంది. మాతాజీ ఆ కొత్త ఇంట్లో కాలుపెట్టి, కొబ్బరికాయ కొడితే ఎంత బాగుంటుంది! అని నా మనస్సులో అనుకున్నాను. అది అయ్యే పనేనా? ఆమె అలాంటి కార్యక్రమానికి రావాలంటే ఆరు నెలల ముందే అర్థించి, అంగీకారం తీసుకోవాలట.

ఆ రోజు ఆగస్ట్15 శెలవు రోజు. జగదీశ్వర్‌గారి గృహప్రవేశానికి ఉదయం 9గంటలకే బయలుదేరి వెళ్ళాము. పూజ కార్యక్రమాలు నడుస్తూ వున్నాయి. ఆ తెల్లవారుజామునే గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. మాతాజీ ఒక ప్రక్కగా కూర్చుని, జగదీశ్వర్ దంపతులు పూజ చేస్తుంటే చూస్తున్నారు. దూరంగా కూర్చుని వున్న నాకు, మాతాజీని ఒక్కసారి కొత్త ఇంటికి రమ్మనమని అడిగితేనో! అనిపించింది. వెంటనే ఎవరో నెట్టినట్లుగా, లేచి వెళ్ళి అమ్మ చెవి దగ్గర కూర్చుని, 'అమ్మా! ఇల్లు ఇక్కడికి దగ్గరే. బాబుగారి దయవల్ల కొడుకు కోడలు ఇల్లు కొనుక్కున్నారు. మీరు ఒకసారి వచ్చి కొబ్బరికాయ కొడితే చాలు!' అన్నాను.

నా చనువుకు వారు కోప్పడకపోగా, నా వంక చూసి, చిన్నగా నవ్వుతూ '....... వారేమనుకుంటారో!' అన్నారు. 'వారికేమీ అభ్యంతరం వుండదమ్మా! వారికెందులోనూ నమ్మకం వుండదు. నేను ఏమి చేసినా వారేమీ కాదు అనరు' అన్నాను. 'అయితే సరే. ఇక్కడికి దూరమా?' అన్నారు వారు. 'అబ్బే లేదమ్మా! ఒక పావుగంట, 20 ని॥లు పడుతుంది

కారులో ఇక్కడి నుంచి' అన్నాను. వారు తల వూపి 'సరే! ఇక్కడ కార్యక్రమం అయిన తరువాత ....' అన్నారు. నేను ఆనందంతో నన్ను నేనే నమ్మలేకుండా వున్నాను. అమ్మవెంట వున్న రాజుగారికి ఈ విషయం చెప్పాను.

ఆయన 'ఇక్కడ భోజనాలు అవీ అయి, అమ్మ వెళ్ళే ముందు గుర్తు చేయండి' అన్నారు. నేను వెంటమే మా డ్రైవర్‌ని ఇంటికి పంపి, క్రొత్త ఇంటి తాళాలు తెప్పించాను. వచ్చేటప్పుడు ఒక అయిదు కొబ్బరికాయలు, స్వీట్స్, ఒక దండ కూడా తెప్పించాను.

మరొక గంటలో భోజనాలు కూడా అయిపోయాయి. మాతాజీ జగదీశ్వర్ దంపతులతో ఏదో ముచ్చటిస్తున్నారు. ఈలోగా వెళ్ళిపోవడానికి ఉపక్రమించారు. నేను వెంటనే రాజుగారికి గుర్తు చేశాను. ఆయన మాతాజీగారితో మాట్లాడి, 'మీరు వెళ్ళి మాతాజీగారి కారులో కూర్చుని, వారికి ఇంటి దారి చూపించండి' అన్నారు. నేను ముందు సీటులో కూర్చుని దారి చూపిస్తుండగా, అమ్మగారు వెనుక సీటులోను, మరొక ఇద్దరు నా కారులోనూ బయలుదేరి, సరిగ్గా 20, 25 నిమిషాల లోపు మా క్రొత్త ఇంటికి చేరుకున్నాము.

మాతాజీ క్రిందకు దిగకుండానే, నేనూ మా డ్రైవర్ కలసి ఇంటి తలుపులు తెరిచాము. మాతాజీగారు పాపం కొంచెం అస్వస్థతలో వున్నారు. అలాగే నెమ్మదిగా లోపలికి వచ్చారు. వారి చేతికి కొబ్బరికాయలు ఇచ్చి హాలు, వంటిల్లు, గదుల గడపలలో కొట్టించాను. వారు 'జై సద్గురుదేవ్!' అంటూ కాయలు కొట్టారు. సద్గురుదేవులే ప్రత్యక్షంగా, ఆ కార్యక్రమం నిర్వహించినట్లుగా భావించి, మాతాజీగారి మెడలో పూలమాల వేసి, పాదాలకు నమస్కారం చేశాను. కూడా తీసుకువచ్చిన పాలకోవ ముక్కలను అందరికి ఇచ్చాను. అంతటితో ఆ కార్యక్రమం ముగిసింది. అమ్మగారు 'ఇల్లు బాగుంది' అంటూ బయటకు వచ్చి, తమ కారెక్కి వెళ్ళిపోయారు. నేను నమస్కారం పెడుతూ నిలబడ్డాను. అంత చక్కగా నేను ఆశించినంత గొప్పగా క్రొత్త ఇంటి గృహప్రవేశ కార్యక్రమం జరిగింది. ఆరు నెలలు వేచి చూసినా అమ్మగారి అనుగ్రహం అంత బాగా లభించదు! అది నా అదృష్టంగానూ, నా నిశ్చల భక్తికి బహుమానంగానూ భావించాను. మన మనస్సులోని కోరికలను తెలుసుకుని, గురుదేవులే అలా అనుగ్రహిస్తారు అని చెప్పడానికి ఇంత కన్న దృష్టాంతం ఏముంటుంది?

- సశేషం

# హనుమంతుడు

-పాలూరి కాళీప్రసాద్

**బాలార్కాయుత తేజసం త్రిభువన ప్రక్షోభకం సుందరం**
**సుగ్రీవాది సమస్త వానరగణైః సంసేవ్య పాదాంబుజం**
**నాదేనైవ సమస్త రాక్షస గణాన్ సంత్రాసయంతం ప్రభుమ్**
**శ్రీమద్రామ పదాంబుజ స్మృతిరతం ధ్యాయామి వాతాత్మజమ్॥**

హనుమంతుడు ఎంత శక్తిమంతుడో మనందరికీ తెలిసినదే. త్రిభువన ప్రక్షోభకం - మూడు లోకాలను ఒక్కపెట్టున అతలాకుతలం చేయగలిగిన శక్తిమంతుడైనా, మధ్యాహ్న మార్తాండుడిలాగా తన తేజస్సుతో మనలను మండించకుండా - బాలార్కాయుత తేజసం - ఉదయించే సూర్యుడిలాగా మన మనస్సులకు ఆహ్లాదాన్నే కలిగిస్తాడు. ఇక సుందరం - ఒక వానరుడు సుందరంగా వుండటం ఏమిటని మనం అనుకోవచ్చు. అయితే, Beauty is in the eye of the beholder - అందం చూసేవారి కంటిలో (దృష్టిలో) వుంటుందని ఆంగ్లంలో సామెత. అందం అంటే మనసుకు ఆహ్లాదాన్ని కలిగించేది. ఒకసారి హనుమంతుని రూపం తలచుకోగానే ఎంతటి చికాకులలో, కష్టాలలో వున్నవారికైనా ఒక్కసారిగా ఆనందం, ఉత్సాహం కలుగుతాయి. అంతేకాదు, మామూలుగా ఎక్కడైనా బలవంతుడైన శత్రువో, పెద్ద ఆపదో పొంచి వున్నదంటే ఎవరైనా దూరంగా పారిపోవడానికే ప్రయత్నిస్తారు. కానీ, సుందరకాండలో చూస్తే, వేలాది రాక్షసులు హనుమంతుని చేతిలో మరణిస్తున్నా, ఇంకా, ఇంకా వేలాదిగా ఆయన వద్దకు వస్తూనే వుంటారు కానీ, పారిపోరు. అంటే ఒక మంట మిడుతల దండుని ఎంతగా ఆకర్షిస్తుందో, అలాగే ఆ రాక్షసులను కూడా ఆకర్షించేంతటి సుందర రూపం ఆయనది. హనుమంతుడు శత్రుపురంలో వున్నా నిర్భయంగా సత్యాన్నే ప్రకటించాడు. అలాగే సీతమ్మకు, రామ లక్ష్మణులకు అడుగడుగునా మంగళాన్ని (శివం) కలిగించాడు. ఏదైతే సత్యమో, శివమో అదే సుందరం.

ఇక సుగ్రీవుడు మొదలైన సమస్త వానరులతో సేవింపబడే పాదపద్మములు కలవాడు అంటే మనకు కొంచెం అనుమానం వస్తుంది. మిగతా వానరులు ఆయనను సేవించారంటే నమ్ముతాం కానీ, సుగ్రీవుడు రాజు, హనుమంతుడు ఆయనకు మంత్రి కదా. పైగా

రామాయణంలో ఎక్కడ చూసినా 'నా ప్రభువైన సుగ్రీవుడు' అనే హనుమంతుడు సంబోధిస్తాడు. మరి సుగ్రీవుడు హనుమంతుని పాదాలను సేవించడమేమిటి? అయితే సుగ్రీవుడు అంటే మంచి కంఠం కలవాడు అని అర్థం. **బుద్ధిర్బలం యశో ధైర్యం నిర్భయత్వమరోగతా అజాడ్యం వాక్పటుత్వంచ హనుమత్ స్మరణాత్ భవేత్** అని పెద్దలు చెబుతారు కదా. అలాగ హనుమత్ స్మరణ ద్వారా వాక్పటుత్వాన్ని సాధించిన బుద్ధిమంతులు అందరూ సుగ్రీవులే. మరి వారందరూ నిరంతరం ఆ హనుమంతుని పాదపద్మాలను సేవిస్తూనే వుంటారు కదా. అలా నిరంతరం సేవించుకుంటే ఆ కొమ్మ మీద నుండి ఈ కొమ్మ మీదకు, ఈ కొమ్మ నుండి ఆ కొమ్మకు వానరంలాగా దూకుతూవుండే మన బుద్ధి స్థిరత్వాన్ని పొంది, పద్మంలో మకరందాన్ని గ్రోలుతూ అక్కడే నిలిచిపోయిన భ్రమరంలా ఆ పాదాలయందే నిలచిపోతుంది.

'నువ్వరిస్తే అరుపులు, అదే నేనరిస్తే మెరుపులే!' అని ఏదో ప్రాసకోసం మన సినిమా హీరోలు చెబుతారు కానీ, అసలు అరుపులతో మెరుపులేమిటి, పిడుగులే సృష్టించినవాడు హనుమంతుడు. ఆయన ఒక్కసారి పెద్దగా నాదం చేస్తే సమస్త రాక్షస గణాలు భయంతో గజగజ వణికిపోతాయి. ఆ బయట వున్న రాక్షసులే కాదు, భూత ప్రేత పిశాచాలే కాదు, మనలో వున్న దుష్ట సంకల్పాలు, దుర్గుణాలు, దుష్టవాసనలు, అన్నీ కూడా ఒక్కసారి ఆ హనుమంతుని సింహనాదం వినగానే, గజగజ వణుకుతూ తోక ముడుచుకుని పలాయనం చిత్తగిస్తాయి.

అయితే ఇంతటి అమోఘ శక్తిమంతుడు, గుణ సంపన్నుడు అయినా ఆయన ఎన్నడూ ఇది తన శక్తి అనే భావనే మనస్సులోకి రానీయకుండా నిరంతరం శ్రీరామచంద్ర పాదాబ్జాల ధ్యానంలోనే రమిస్తూ వుంటాడు. అటువంటి వాతాత్మజుడైన హనుమంతుని ధ్యానిస్తే మనకు కూడా ఆయనలోని కొన్ని సుగుణులైనా అలవడతాయి. హనుమంతుడు ఒక్క రామాయణంలోనే ఎన్నెన్ని మహత్తర కార్యాలు నిర్వహించాడో లెక్కపెట్టలేము. అంతేకాక, ఆయన చిరంజీవి. ఇప్పటికీ అనేకమందిని అనేక విధాలుగా సంరక్షిస్తూనే వున్నాడు.

- సశేషం

# ఎవరు అస్పృశ్యుడు?

(గత సంచిక తరువాయి)

-సుషమ్నా ప్రసాద

పంచపాండవులంటే ఆదర్శనీయమైన సోదరులుకానీ, అంటరానివారని కాదు. మనకు ముక్తిని ప్రసాదించడానికి దోహదం చేసేది పంచాక్షరీ మంత్రము (నమశ్శివాయ). అలాగే పరమశివుని మనం పంచామృతములతో అభిషేకిస్తాము. అన్నిటికంటే ప్రధానమైనది పంచభూతములు పృథ్వి, ఆకాశము, వాయువు, అగ్ని, జలము. మానవ శరీరం పంచభూతాత్మికము. ఈ భూతాలలో ఏ ఒక్కటి లోపించినా శరీర నిర్మాణం జరగదు. పంచభూతముల సంకలనము లేకపోతే మానవజీవితపు మనుగడే లేదు. పంచభూతాత్మికమైన ఈ శరీరంలో పంచజ్ఞానేంద్రియములు, పంచ కర్మేంద్రియాలు వున్నాయి. మనకు శ్రేష్ఠమైన భోజనమును పంచభక్ష్య పరమాన్నము అంటాము. మనకు మంచిచేసే ఔషధమును పంచకూళ్ల కషాయము అంటాము. అలాగే పంచలోహములు శ్రేష్ఠమైనవి. అంటే 'పంచ' శబ్దము పవిత్రతకు సంకేతము కానీ అంటరానితనమునకు కాదు. మన శరీరం కూడా పంచకోశ సమ్మేళము (అన్నమయ కోశము, ప్రాణమయ కోశము, మనోమయ కోశము, విజ్ఞానమయ కోశము, ఆనందమయ కోశము). మన ఆంధ్రప్రదేశంలో పవిత్ర శివక్షేత్రములు అయిదు ఉన్నాయి. వాటిని పంచారామాలు అంటాము.

ఈ అంటరానితనము గురించి శ్రీ శంకరభగవత్పాదాచార్యుల జీవితంలో కూడా ఒక ముఖ్యమైన సంఘటన వున్నది. అదే మనీషా పంచకములో వివరించబడినది. ఒకనాడు శంకర భగవత్పాదా చార్యులవారు గంగా స్నానమునకు బయలుదేరారు. అప్పుడొక చండాలుడు (పంచముడు) స్వామివారిని స్పృశించడానికి మీదమీదకు వచ్చాడు. అప్పుడు స్వామి అతనిని (గచ్ఛ గచ్ఛ) దూరంగా తొలగమన్నారు. కానీ, అతను తొలగకుండా శంకర భగవత్పాదాచార్యుల వారిని ఇలా ప్రశ్నించాడు ... **అన్నమయాదన్నమయం అథవా చైతన్యమేవ చైతన్యాత్ ద్విజవర! దూరీకర్తుం వాంఛసి కిం బ్రూహి గచ్ఛ గచ్ఛేతి.** తాత్పర్యం - బ్రాహ్మణోత్తమా! దేనిని తొలగమంటున్నారు? ఇద్దరిలోనూ వున్నది అన్నమయకోశమే. ఇరువురినీ

కదిలించేది చైతన్యమే. దేనిని తప్పుకోమంటావు? అని ప్రశ్నించాడు.

మీరు శిష్యులకు వేదాంతమే కదా బోధిస్తున్నారు! వేదాంతము వారు వేరు, వీరు వేరు అని చెబుతున్నదా? గీతలో విద్యావినయ సంపన్నే బ్రాహ్మణేగవి హస్తిని శుని చైవ శ్వపాకేచ పండితా సమదర్శినః అని చెప్పారు కదా. అంటే, విద్యావినయ సంపన్నుడైన బ్రాహ్మణుని, గోవుని, ఏనుగును, కుక్కను, కుక్కమాంసమును తినేవాడిని సమదృష్టితో చూడగలిగినవాడే నిజమైన పండితుడని నిర్వచించారు కదా. మరి ఈ భ్రాంతి మీకు ఎలా కలిగింది? అని చండాలుని రూపంలో వున్న సదాశివుడు ప్రశ్నించాడు. మీరు సదా అహం బ్రహ్మాస్మి, శివోహం అని పలుకుతూ వుంటారు కదా ద్విజోత్తమా! దాని అర్థమేమిటని శ్రీ శంకరభగవత్పాదులవారిని చండాల రూపంలో వున్న సదాశివుడు ప్రశ్నించాడు. బింబ ప్రతిబింబవాదము, అవిచ్ఛిన్న వాదములని రెండు రకాల వాదములున్నవి. బింబ ప్రతిబింబవాదము ప్రకారము సూర్యబింబము ఒక్కటైనా అనేక ఘటములు నీటితో నింపి పెడితే, అన్ని ఘటములలో ప్రతిబింబాలు గోచరిస్తాయి. ప్రతిబింబములకు ప్రత్యేకమైన ఉనికి లేదు. సూర్యబింబం పైనే ఆధారపడి వున్నవి. సూర్యుడు పవిత్రమైన గంగయందు ప్రకాశించినట్లే చండాలవాటికలో వున్న మడుగులో కూడా ప్రకాశిస్తాడు. ఒక సూర్యుడు సమస్త జీవులకు తానొక్కొక్కడై ప్రకాశిస్తున్నాడు. అలాగే పరమాత్మ అన్ని అంతఃకరణముల యందు ప్రకాశిస్తున్నాడు. కానీ, ఉపాధి భేదాలను బట్టి ప్రతిబింబ భేదాలు వుంటాయి. కనుక అన్ని ఉపాధులలో ప్రకాశించే పరబ్రహ్మ ఒక్కటే. అందుచేత ద్విజోత్తమునకు వెలుగునిచ్చే సూర్యుడు, చండాలునకు వెలుగునిచ్చే సూర్యుడు ఒక్కడే. భగవానుడు అపరిచ్ఛిన్నుడు. ఉపాధులు మాత్రమే పరిచ్ఛిన్నమైనవి. ఈ బింబ ప్రతిబింబవాదము, అపరిచ్ఛిన్న వాదము రెండింటినీ సూచిస్తూనే చండాల రూపంలో వున్న సదాశివుడు శంకర భగవత్పాదులవారిని ప్రశ్నించారు. ఈ ప్రశ్నను చండాలుడు జ్ఞాన విధానంలో ప్రశ్నించాడు. అందుచేత శంకరాచార్యులు కూడా జ్ఞాన విధానంలోనే సమాధానమిచ్చారు.

- సశేషం

## సంస్మరణ



శ్రీ పరబ్రహ్మ షణ్ముఖానంద ఆశ్రమ పీఠాధిపతులు, పరమ పూజ్య శ్రీశ్రీశ్రీ జ్యోతిర్మయానంద భారతి మాతాజీ వారు ది. 5-5-2021 బుధవారం నాడు బ్రహ్మీభూతులైనారు. వీరి వయస్సు 65 సంవత్సరములు



పరమాత్మానంద ఆశ్రమ పీఠధిపతి, పెనమలూరు, పరమపూజ్య ఆచార్య శ్రీశ్రీశ్రీ శంకరానందగిరి స్వామివారు ది. 8-5-2021 శనివారము నాడు శివైక్యం చెందారు. వీరి వయస్సు 76 సంవత్సరాలు.



పరమపూజ్య శ్రీశ్రీశ్రీ నిత్య శుద్ధానంద గిరి స్వామివారు ది. 16-6-2021 బుధవారము నాడు బ్రహ్మలీనులైనారు. వీరి వయస్సు 108 సంవత్సరములు.



పరమపూజ్య శ్రీశ్రీశ్రీ త్యాగీశానంద పురి మాతాజీ వారు ది. 17-6-2021 గురువారము నాడు బ్రహ్మలీనులైనారు. వీరి వయస్సు 88 సంవత్సరములు

ఈ మహాత్ముల సంస్మరణార్థం శ్రీ కాళీవనాశ్రమ పీఠాధిపతులు యోగిని శ్రీ చంద్ర కాళీప్రసాద మాతాజీ భక్తులతోటి ప్రార్థనలు చేశారు.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

శ్రీ మాతాజీ ఇంకా మాట్లాడుతూ..... మనస్సు చెడ్డది కాదు. అది లత లాంటిది. మొక్క వేసి వదిలివేస్తే అది ఎలా పడితే అలా పాకుతూ వుంటుంది. దానికి అందించిన దాన్ని బట్టి ఆ విధంగా పాకుతుంది. ఆ లతను దగ్గరగా వున్న చెట్టుకో లేక ఒక కర్ర పాతి దానికి అందిస్తే అది దాన్ని పెనవేసుకుంటూ పైకి ఎగబ్రాకుతుంది. అలాగే ఈ మనస్సనే లత గురుపాదాలకు పెనవేసుకోవాలి. గురు లక్ష్యార్థమందు పెనవేసుకోవాలి. ధ్యేయ వస్తువునందు పెనవేసుకోవాలి. మనస్సు శనగగింజ లాంటిది. గట్టిగా వున్న శనగగింజ పంచదార పాకంలో వేస్తే తియ్యగా, ఆవకాయలో వేస్తే పుల్లపుల్లగా, కారం కారంగా, వేపరసంలో వేస్తే చేదుగా మారుతుంది. మరి పూర్వపు వాసనలు ఏమయ్యాయి అనుకుంటున్నారా? ఎప్పుడైతే గురుపాదాల చెంత చేరామో 'నీకేం భయం లేదు' అని వారి అభయ హస్తం దొరికిందో, అప్పుడే ఆ వాసనలన్నీ చతికిలపడవలసినదే. మనం వారు చెప్పినమాట వింటూ, ఆచరణలో పెడితే మనని బలమైన వాసనలేవీ బంధించవు, శిక్షించవు.

గురుదేవులు మనస్సు నిలబెట్టటం అనే విషయం వచ్చినప్పుడు కొన్ని ఉదాహరణలు చెప్పేవారు. నిమ్మకాయ లేక కోడిగుడ్డు గట్టి నేల మీద పెడితే దొర్లుకుంటూ పోతాయి. కానీ రోజూ పెట్టిన చోటే పెడితే కొన్నాళ్లకి అక్కడ గుంటపడి ఆ గుండ్రంగా వున్నది నిలుస్తుంది. అలాగే కుండలో నీళ్ళు పట్టడం కోసం బావి దగ్గర ఒక గట్టి రాయి మీద కుండ వుంచితే అది నిలబడదు. కానీ, పెట్టగా పెట్టగా అక్కడ గుంటపడి కదలకుండా వుంటుంది. అలాగే పట్టుదలతో చేయాలే తప్ప మనస్సు ఎందుకు నిలబడదు? మనస్సు ద్వారా, శబ్దాల ద్వారా మరి ఏ ఇతర బాహ్య విషయాల ద్వారా వచ్చే కర్మలు అంటకుండా పోతాయి. అప్పుడు నువ్వు సాక్షివై పోతున్నావు. సాధన సరిగ్గా చేయలేక పోతున్నాను అని తెలియపరచేది, మనస్సు నిలవడం లేదని సాక్షిగా వుండి మనచేత చెప్పించేది, చేయించేది ఆత్మ. సాధకుడికి ఆ విధమైన ఆవేదన, తితీక్ష కలగాలి. ఒక అవగాహన రావడం కోసం గురువులు మనకోసం వచ్చి, మనతోపాటు వుండి, మనకు జ్ఞానబోధ చేస్తున్నారు. మనస్సు ధ్యానంలో నిలవాలి అంటే మన స్వభావాన్ని, ప్రవృత్తిని మార్చుకోవాలి. లేకపోతే

స్వర్గమో, నరకమో బ్రతికి వుండగానే అనుభవిస్తాము. ముఖ్యంగా సాధకులు భార్యా భర్తలైతే ఒకరితో ఒకరు సహకరించుకుంటూ ఒక అవగాహనకి రావాలి అని శ్రీమాతాజీ చెబుతూ, ఇంకా ఇలా అన్నారు.... నేను ఎవరు? దేనికి సంబంధించినవాడిని? ఎక్కడికి వచ్చాను? అని విచారణ చేస్తూ వుంటే, ఈ త్రిపుటి అంతా నాలో నుంచే వస్తోంది అని గ్రహిస్తాము. దాని అనుభవానికి సాక్షిమాత్రమే అని తన కంటి ఎదురుగా జరిగే విషయాలను యథాతథంగా చూస్తాము. ఆయా విషయాదుల యందు ఆసక్తి, సంబంధం లేకుండా చూస్తాం. ఉదాహరణకు ఒక వ్యక్తి ఒక ఊరు వెడితే ఆయనకు గజమాల వేసి, గొప్పగా సన్మానించి ఊరేగించారట. అదే వ్యక్తి ఇంకో ఊరు వెడితే ఆయనకు పడని శత్రువెవరో ఎదురుపడి ఆయన మీద బురదనీళ్ళు జల్లాడట. ఇంకో చోటికి వచ్చి తన భార్యా పిల్లలకు ఏవో కొని తీసుకుని వెళ్ళాడు. ఒకే వ్యక్తి వున్నాడు ఈ మూడు పరిస్థితులలోను. సన్మానించినప్పుడు పొంగిపోలేదు, బురద జల్లినప్పుడు క్రుంగిపోలేదు, భార్యాబిడ్డల పట్ల ధర్మపరంగా ప్రవర్తించాడు. వీటన్నింటి యందు అహంకార మమకారాలు లేకుండా సర్వసాక్షి అయ్యాడు. అక్కడ బంధన లేదు. సాధనకు కావలసిన విషయమైతే బాగా ఆతృతతో శ్రద్ధగా వినాలి. సాధనకు అవసరం లేని విషయం భగవంతునికి అర్పించి, ఉదాసీన భావనతో వుండాలి. సృష్టికి తాను సాక్షియే. తాను కర్త కాదు, కారయిత లేడు, క్రియ లేదు. అక్కడ మిగిలింది 'తానే' (నేను). ప్రపంచంలో వుంటూనే సాక్షి భావంతో చూడాలి. ప్రపంచంలోని వాటన్నింటికీ జగత్తును చూసే సామర్థ్యమును ఇచ్చిన శక్తి ఏదైతే వుందో చిన్మాత్రమైన ఈ ఆత్మే ఆ పరమాత్మ. ఈ సందర్భంలో శుక మహర్షి గురించి చెప్పారు. వ్యాసులవారు శుకమహర్షిని (జ్ఞాని అయినా) ఇంకా జ్ఞానాన్ని పొందాలని జనక మహారాజు వద్దకు సందేహాలు తీర్చుకురమ్మనమని పంపారు. అక్కడకు వెళ్ళిన తరువాత రాజభటులు వారిని ఒక వారం రోజులు రాజభవన ద్వారం దగ్గరే నిరీక్షింపజేశారు. ఆ తరువాత లోపలికి ప్రవేశపెట్టి రాజ్యంలోని వైభవాలన్నీ చూపించారు. తరువాత స్త్రీలచేత పరిచర్యలు, సేవలు చేయించారు. ఆ తరువాత మంచి భోజ్య వస్తువులు సేవించడానికి పెట్టారు. ఈ భోగముల వేటియందూ ఆయనకు దృష్టి లేదు. ఆయనది కేవలం జ్ఞానదృష్టి. అప్పుడు జనకమహారాజు దర్శనం అయింది.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2021**

2 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

6 శుక్ర - మాస శివరాత్రి

8 ఆది - అమావాస్య

11 బుధ - శ్రావణ శుద్ధ తదియ - సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

20 శుక్ర - వరలక్ష్మీ వ్రతం

22 ఆది - శ్రావణ పూర్ణిమ - రాఖీ - శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన

30 సోమ - శ్రీకృష్ణాష్టమి కలశ స్థాపన, శ్రీరాధాకృష్ణ సహస్రనామార్చన, భక్త సమారాధన. రాత్రి 7గం. శ్రీ సద్గురు పాదపూజ.

31 మంగళ - ఉదయం 11గం.లకు సాముహిక శ్రీ రాధాకృష్ణ సహస్ర నామార్చన, భక్త సమారాధన.

**సెప్టెంబర్ 2021** -

1 బుధ - శ్రీగురుదశమి, ఏకాహం, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

4 శని - శనిత్రయోదశి

5 ఆది - మాస శివరాత్రి, ఉపాధ్యాయ దినోత్సవం

7 మంగళ - అమావాస్య

10 శుక్ర - వినాయక చవితి - తె.జా 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, ఉ. 11గం. సాముహిక గణపతి పూజలు, భక్తసమారాధన.

18 శని - శనిత్రయోదశి.

20 సోమ - భాద్రపద పూర్ణిమ - ఆశ్రమ ట్రస్ట్ హాస్పిటల్ వార్షికోత్సవం, శ్రీ సద్గురుపాదపూజ.

# శ్రీబాబు దివ్యవాణి

(గత సంచిక తరువాయి) సేకరణ - డా॥ రాఘవేంద్ర పరుచూరి.

ఈ సుతీక్ష్ణ మహర్షి ఎన్నో యుగములనుండి ప్రాణాయామంతో తపస్సు చేస్తున్నాడు. ఏ వస్తువు గూర్చి తాను తపమాచరిస్తున్నాడో ఆ ఆత్మ సాకారముగా తనకు దర్శనమిస్తాడని, ఆ స్వామి కొరకు అలా నిలచి (ప్రాణాలు నిలుపుకొని) జీవించి వున్నాడు. ప్రాణవాయువును కుంభింపచేసి ఎన్ని యుగాలైనా జీవితమును నిలుపుకోవచ్చును. అలా తపస్సు చేస్తున్న సుతీక్ష్ణ మహర్షి 14 లోకములను దాటిపోయాడు. కొంత తపస్సు తరువాత ఒకోలోకము నుండి ఆ రాజు వచ్చి, 'స్వామి, మీరు నా పదవిని అధిష్ఠించండి, ఈ భోగభాగ్యాలను అనుభవించండి' అని మహర్షితో చెప్పినప్పటికీ ఆయన కన్నెత్తి అయినా చూసేవాడు కాదట. ఇలా అన్ని లోకాలను దాటివేసాడు.

ఈ రామలక్ష్మణులు అలా గుమ్మందగ్గరే నిలబడి పోయి లోనికి చూస్తూంటే ఒక దివ్యంగా వెలిగి పోతున్న విమానంలో ఇంద్రుడు దిగివచ్చి లోనికి వెళుతున్నాడు. ఎంతో తేజస్సుతో వెలిగిపోతున్న ఇంద్రుడు మహర్షి దగ్గరకు వెళ్తుంటే లక్ష్మణుడు ఆశ్చర్యపడి రామునితో 'అన్నా! ఆ దివ్యపురుషుడెవరు?' అని అడిగాడట. అపుడు రాముడు అన్నాడట 'చూడు లక్ష్మణా! ఆ వచ్చిన దివ్య పురుషుడు సాక్షాత్ దేవేంద్రుడు, తన దేవేంద్ర పదవిని స్వీకరించమని అడగటానికి వచ్చాడు, చూడు' అని. ఆ ఇంద్రుడు మహర్షి సన్నిధికి వెళ్ళి "స్వామి! మీరు నా పదవిని అధిష్ఠించండి. స్వర్గమునకు రండి, నా సేవకులందరూ మీకు సేవ చేస్తుంటారు, స్వర్గ భోగభాగ్యములను అనుభవించవచ్చు" అంటే, మహర్షి కన్నులు తెరచి "ఆ! ఏమిటి? నేను నీ పదవికొరకు తపస్సు చేయలేదే, నాకేమి అక్కర్లేదు, ఫో" అన్నాడట.

అప్పుడు ఇంద్రుడు "అయ్యా! నా పదవి ఎందరో కావాలనుకుంటారు, దానంతట అది లభించినప్పటకీ వద్దంటావేమయ్యా" అన్నాడట. దానికి మహర్షి తిరిగి "అయితే ఆ పదవిలో వున్నంతసేపు నీవు శాంతితో హాయిగా వుంటున్నావా మరి" అని అడిగాడట. దానితో ఇంద్రుడు "అదేమిటయ్యా, బాబు! ఎప్పుడు ఎవరు తపస్సు చేస్తున్నారో, నా పదవి ఎక్కడ పోతుందోనని యీ

చింతతోనే సరిపోతుంది, శాంతి లేనేలేదు" అని చెప్పినాడట. అప్పుడు ఆ మహర్షి ప్రశాంత వదనంతో "కొద్ది సేపువుండి మరుక్షణం పోయేటటువంటి తుచ్ఛమైన పదవి కోసం నేను తపస్సు చేయటంలేదు, దేనిని పొందితే యిక పొందవలసినది లేదో, అది మరల మార్పు చెందుతుందనే భయంలేదో అటువంటి శాశ్వతమైన పదవి కొరకు తపస్సు చేస్తున్నానయ్యా! నీ పదవి నా కేమి అక్కర్లేదు, ఫో ఫో " అని గడ్డి పరకను తీసిపారేస్తున్నట్లు అ ఇంద్రపదవిని కూడ తృణీకరించాడు.

ఇహాముత్రార్థ ఫలభోగ విరాగము అంటే ఇట్లా వుండాలి. ఆయనే (సుతీక్ష్ణ మహర్షి) చాలా తపోసంపన్నుడు, రామ చంద్రుని దర్శనం కొరకే ఆయన జీవించి వున్నాడు. శ్రీరాముని దర్శించగానే మహర్షి దేహాన్ని విడిచి పెట్టి రామచంద్రుని చూస్తూ రామచంద్రునిలో లయించిపోయారు" అని చెప్పి శ్రీబాబు ముగించారు.

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**ఆగస్ట్ 2021**

2 సోమ - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

22 ఆది - శ్రావణ పూర్ణిమ, రాఖీ -ఉదయం 11గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

30 సోమ - శ్రీకృష్ణాష్టమి - సా. 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

**సెప్టెంబర్ 2021-**

1 బుధ - శ్రీగురుదశమి - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

10 శుక్ర - వినాయక చవితి - ఉ. 11గం. శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

20 సోమ - భాద్రపద పూర్ణిమ - సాయంత్రం 5-30ని॥ శ్రీసద్గురు పాదపూజ, సత్సంగం, భక్తసమారాధన.

# ధర్మోపదేశం

- మురళి

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ధర్మోపదేశం ..........

ముక్తిని పొందటానికి సద్గురువును ఆశ్రయించాలి. బ్రహ్మచర్యమును అవలంబించి, నిరంతరం హరి కథామృతపానం చేస్తూ వుండాలి. చెడు తలపులపై మనస్సును పోనీయకుండా, శాంత స్వభావము, భూతదయ, అహింస, పరోపకార బుద్ధి మొదలైన వాటిని కలిగి వుండాలి. సాధుజన సేవ, సర్వజన విధేయత, సదాచార సంపన్నత, క్షమము, తపోశక్తి, మౌనవ్రతము, సుఖ దుఃఖాల యందు సమబుద్ధి, వేద శాస్త్ర పురాణ పఠనము, అపార భగవద్భక్తి, పరనింద వర్జితము. అన్యమత సహనము, దూరాలోచన, దుర్జనులకు దూరంగా వుండటం, శమదమాది సద్గుణాలు, సమస్త దైవ కైంకర్యముచేయటం, సకలము పరమాత్మయే అని భావించడం మొదలైన లక్షణాలు కలిగి వుండటమే మానవ ధర్మము. సదాచార సంపన్నత, సద్గుణాలు మోక్షమును పొందే మార్గాలు.

ఆత్మబల సంపన్నులకు ఈ ప్రపంచంలో అసాధ్యమైనదేదీ లేదు. అట్టి ఆత్మబలం మంచి శీలము వలనే లభిస్తుంది. ఆత్మబలమే దైవబలము. ఆత్మబల సంపన్నులకు సర్వమూ వశమై వుంటుంది. దాని వలనే కొంతమంది మహర్షులు నక్షత్ర మండలములో వెలుగుతున్నారు. అట్టి ప్రకాశమును కలుగజేసేది విద్యయే. ఇట్టి విద్యను బోధించువారే సద్గురువులు.

కంటికి కనబడే ఈ ప్రపంచమంతా ఇంద్రజాలమనే మాయచేత కప్పబడి వున్నది. ఇది ఎండమావుల వంటిది. ఈ చరాచర సృష్టి అంతా మాయ అని తెలుసుకోవాలి. మాయయే భ్రమకు కారణభూతమవుతున్నది. నాలుగు భువనములు మాయచేత నిండి వున్నాయి. ఈ ప్రకృతి అంతా మాయ. సుఖ దుఃఖములు మాయ, అనుభవము కూడా మాయయే. ఈ మాయకు మూలమనేది లేదు. ఇదే కష్టసుఖాలకు కారణమవుతోంది.

భావాతీతాలే అచల పరిపూర్ణమని గ్రహించాలి. నామ రూప క్రియా రహితమైనది, ఆద్యంతములు లేనిది, ప్రకృతి ప్రపంచముతో

సంబంధం లేనిదిగా వుంటుంది. ఎందును సందు లేక సర్వత్ర నిండి నిబిడీకృతమైన ఈ అచల పరిపూర్ణము ఇట్టిదని, అది తప్ప ఈ ప్రపంచమునకు మరేదీ లేదని తెలుసుకుని ఆరూఢ జ్ఞానియై వుండటమే పరిపూర్ణత్వము పొందటం. అదే నిర్మలత్వము. ఆరూఢ విశ్రాంతికి ఇదే మార్గము. జ్ఞానులు ఈ మాయా ప్రపంచపు విషయాలయందు చిక్కుకొనకుండా విసర్జిస్తారు. మనోనిగ్రహము అత్యంత ఆవశ్యకము. మనో నిగ్రహం లేని వేదాంతం ప్రయోజన శూన్యము!

**డాక్టర్స్ డే సందర్భంగా ఆశ్రమ వైద్యులతో శ్రీమాతాజీ**



**మన ఆశ్రమ హాస్పిటల్ డాక్టర్లు మరియు సిబ్బంది అవసరార్థులకు నిరంతరం వైద్యసేవ అందిస్తూ వున్నారు. జూన్ 2021లో 1002 పేషంట్స్‌కి ఉచితంగా వైద్యసేవలు అందించటమే కాకుండా, 22 కాన్పులు (11 సాధారణ కాన్పులు, 11 సిజేరియన్, 2 D&C ) పూర్తిగా ఉచితముగా చేయడం జరిగింది. ఈ మహత్కార్యానికి సహాయ సహకారాలు అందించిన భక్తులు మరియు దాతలకు శ్రీ గురుదేవులు అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.**

**కార్య నిర్వాహక వర్గము**

SHKVPB Trust Hospital

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

20-2-1966: ఈ రోజున శ్రీ బాబు సన్నిధిలో జరిగిన సత్సంగ సమావేశానికి మహా పండితురాలైన ఒకామె వచ్చారు. వారు వేదాంత చర్చలలో కూడ నిపుణులట. వారు శ్రీ బాబుతో మాట్లాడుతూ "నిద్రలేవగానే మానవుడు భగవద్దర్శనం చేయాలని ఒక గ్రంథంలో చదివానండీ" అన్నారు. శ్రీ బాబు మాట్లాడుతూ "నిజమేనమ్మా! అజ్ఞాన నిద్ర నుండి లేవగానే కలిగేది భగవద్దర్శనమే! కాని ఆ అజ్ఞాన నిద్ర తొలగకుండా, మామూలు నిద్ర లేచిన మానవుడికి మాత్రం పాలకుండలు, పాలేరువాళ్ళు, డబ్బులూ, నగలూ, కోర్టు వ్యవహారాలూ, కోడి పలావులూ... దర్శనమిచ్చేది యివే అనుకుంటాను? ఏమంటారు? ఎలా అయినా మీరు అనుభవజ్ఞులు గదా!



'అటువంటి అజ్ఞాన నిద్రలో ఉన్నవారికి దాని నుండి మెలకువ తెప్పించి జ్ఞానమనే ఫలాన్ని వారు అందుకోవటంలో సహాయపడరా!' అని మా అమ్మ నన్ను ఆదేశించింది. వీడి డ్యూటీ అదేనండీ! ఇంతకీ నా కులమేమిటా? అని ఆలోచిస్తున్నారు కదూ? బ్రాహ్మణుడై వేదాలు చదివి యజ్ఞయాగాదులు జరిపేదీ వీడే. క్షత్రియుడై కత్తి పట్టి (చేతితో కత్తిని ఝుళిపిస్తున్నట్లు చూపి) దుష్ట శిక్షణ, ధర్మ రక్షణ చేసేదీ వీడే. త్రాసు తక్కెడ పట్టుకుని వ్యాపారం చేసే వైశ్యుడూ వీడే. టుర్‌ర్‌ర్...కోయ్..' అని ఎద్దులను అదిలిస్తూ వ్యవసాయం చేసే శూద్రుడూ వీడే. అన్ని వర్ణాలలోను, అన్నిటిలోనూ వున్నది వీడే. అన్నీ వీడే. అన్నీ వాడే అయిన భగవంతుడు మాత్రం వీడికంటె వేరే ఎలా ఉంటాడు? అలా అన్నీ తానే అయి ఉన్నానని మానవుడు తెలుసుకోవటమే అజ్ఞాన నిద్ర నుండి మేలుకొనటం. అలా మేలుకొన్నపుడు దర్శన మయ్యేదంతా భగవంతుడే గదా! మానవుడు తనలోనే ఉన్న శివుని గుర్తించి, తాను ఆ శివుడనే గాని శవమును (శరీరమును) కానని

తెలుపుకునే రాత్రే మహా శివరాత్రి. ఆ రాత్రిలో అజ్ఞానమనే చీకటి లేదు. అంతటా జ్ఞాన ప్రకాశమే. పగలూ రాత్రి అంతా వెలుగే. అది అనుభవించిన వారికి జీవితమంతా శివరాత్రే" అని చెప్పారు.

గుండుగొలనులో ఒకనాడు శ్రీ బాబు తమను దర్శించటానికి వచ్చిన ఒక వ్యక్తితో "తమరు ఈ మధ్య కనిపించటం లేదేమిటి బాబూ?" అని అడిగారు. ఆ వ్యక్తి "ఆ! ఏమున్నది లెండి! తమోగుణంలో పడి నిద్రపోయాను. కామ లోలుడునైనాను" అని పెడసరంగా జవాబిచ్చాడు. వెంటనే శ్రీ బాబు "అయితే యింకేం? చాలా వృద్ధిలోకి వచ్చినట్లే" అని అందరికీ బోధ చెబుతూ "వారి జవాబు అందరూ విన్నారుగా! మామిడి చెట్టు చుట్టూ దూలగుండ మొలిస్తే, అది ఆ ఫలాలను ఎవరికీ అందనివ్వకుండా చేస్తుంది. ధనవంతుని వద్దకు లోభివాడు చేరితే, ఆ ధనవంతుని ధనం సద్వినియోగం కాకుండా అడ్డు పడతాడు. జ్ఞాని ప్రక్కన ఒక తమోగుణ సంపన్నుడు చేరితే, యితరులకు జ్ఞానాన్ని అందనీయకుండా తన తమోగుణాన్ని వాళ్లకు కూడా అంటించి, వాళ్లతో బాటు తానూ అధోగతి పాలౌతాడు. తస్మాత్ జాగ్రత.

భక్తుడైనవాడు, శిష్యుడు, బాగుపడ దలచినవాడు పెద్దల సమక్షంలో వినయ, భయభక్తులతో మెలగటం నేర్చుకోనంత వరకు, అతడు తనకు తానే అపకారం చేసుకున్నవాడౌతాడు. కనుకనే 'విద్యార్థి అయిన యోగి' అంటే మంచిని నేర్చుకో దలచిన వాడు గురు సన్నిధిలో ఎలా మెలగాలో సీతారామాంజనేయ సంవాదంలో, సీతాదేవి అంజనేయునికి చెబుతూ.........

**'గురుపదాంభోజముల్ కొలువక కల్గునే ! ప్రవిమల వైరాగ్య భాగ్య మహిమ!'**

అనే పద్యంలో...... **అట్లుగావున విద్యార్థియైన యోగి!**

**వినయ భయభక్తు లెదలోన పెనుగొనంగ**

**నల చతుర్విధ శుశ్రూష లాచరించు**

**కొనుచు ననిశంబు గురువుల గొలుచు ననఘ!**

అని బోధించినది. అలా ఆచరించి మారుతి జితేంద్రియుడైనాడు. ఆంజనేయ వరదుని అనుగ్రహం మీపై వర్షించు గాక!" అని అందరిని ఆశీర్వదించారు.

-సశేషం

(గత సంచిక తరువాయి)

## విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

# బోధల బావా

ఇది పండరినాధుని లీల అని గ్రహించిన బావా "మాకోసం నీవు కష్టాలు అనుభవిస్తున్నావా? నన్ను రక్షించటానికి తలారి వేషం ధరించావా?" అని పరితపిస్తుంటే పండరినాధుడు ప్రత్యక్షమైనాడు. బోధల ప్రణమిల్లాడు. పండరీనాథుడు "నీవు వీరాళా గ్రామానికి వెళ్ళినప్పుడు నువ్వు పలాయనమైనావని నీ భర్యా పుత్రులను నిర్భందిస్తే నాగాబాయి ఇంటినుండి నాలుగు వరహాలు, నీ ఇంట్లోఉన్న మూడు వరహాలు తీసుకుని వెళ్లి పన్ను చెల్లించాను" అని చెప్పాడు. బోధల "నేను వీరాళా గ్రామంలోని వర్తకుడి నుండి నాలుగు వరహాలు తెచ్చాను, వీటిని నాగాబాయికి అందచేయి" అన్నాడు. "నా భక్తుడివైన నీకు అప్పు ఇస్తానని చెప్పి మాట తప్పింది. ఈ అపరాధానికి అవె ధనమంతా హరించేటట్లు చేయగలను" అని చెప్పి బోధలను అశీర్వదించి అదృశ్యం అయ్యాడు. బోధల ఇల్లు ధనధాన్యాలతో నిండి పోయింది. జొన్నచేను కంకులతో కళకళలాడింది. బోధల భగవంతుని కరుణా కటాక్షాలను కొనియాడుతూ దీన జనులను ఆదరిస్తూ కాలం గడుపుతున్నాడు.



ధామణ గ్రామానికి ఏడెనిమిది మైళ్ళ దూరములో తాళేరాస అనే గ్రామం ఉంది. ఆ ఊరి గ్రామాధికారి అయిన మోదకముడు బోధలకు బంధువు. అతనికి ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. వారికి బోధల అంటే ద్వేషం. మోదకముని పొలానికి ఆనుకుని బోధల పొలంవుంది. హోసి అనే స్త్రీ మోదకముని పొలానికి కాపలాదారుగావుంది. ఆమె బోధలని ఆశ్రయించి భవరోగంనుండి

తరింపచేయమని అడిగింది. బోధల "నువ్వు ప్రతి ఏకాదశి నాడు పండరీపురానికి వెళ్ళి పండరీనాథుని దర్శనం చేసుకో" అని చెప్పాడు. బోధల చేసే భజనలతో తాళేరాస నుండి జనులు వెళ్ళి పోల్గొంటున్నారు.

ఒకనాడు ఆ గ్రామస్తులు పదిమంది బయలుదేరి బోధల సంకీర్తనకు వస్తుండగా ఒకనిని పాముకాటువేసింది. అతడు మరణించాడు. సంకీర్తనను వదలుకోలేక వాడి శవం పైన ఒక బట్ట కప్పి సంకీర్తన జరిగే స్థలానికి వచ్చి ఒక చెట్టుకు ఆనించి వారు సంకీర్తనలో పాల్గొన్నారు. "జనులారా! అందరూ తాళం వేస్తూ నామం చెయ్యండి. నృత్యం చెయ్యండి" అని ఉత్సాహపరుస్తున్నాడు బోధల బావా. అస్మద్ గురుదేవులు శ్రీ బాబూజీ మహరాజ్‌వారు బోధలబావా గురించి చెపుతూ– "అలా జొన్న చేను మధ్య బోధలబావా ఆనంద తన్మయత్వంలో నృత్యం చేస్తున్నాడు. కాళీయ ఫణాలపై నందకిశోరుని నృత్యంవలె శోభిల్లుతున్నది ఆ నృత్యం. బోధలబావా నృత్యసంకీర్తనామాధుర్యం అక్కడ చేరిన భక్తుల హృదయాలలో కరడు కట్టిన విషయ విషాన్నే విరిచి వేయగలిగింది."

"పాముకాటు తిన్న వ్యక్తిని ఒక చెట్టుకి ఆనించి కూర్చోబెట్టాక, అతనితో వచ్చిన భక్తులందరూ బోధల చేస్తున్న సంకీర్తనానందంలో పరవశులై పోయారు. ఆ వాతావరణమంతా బృందావనంవలె, జన సందోహం యమునా తరంగిణివలె, బోధలబావా శ్రీ కృష్ణునివలె భాసించారు. అందరి ముఖాలూ ఏదో అలౌకిక తేజస్సుతో వెలిగి పోతున్నాయి. అదే కృష్ణ తేజస్సు. ఆ మహాత్ముని దర్శనం ఎంత పుణ్యప్రదం! ఆయన దివ్య స్పర్శ సకల పాపహరణం కదా! అందుకే

**సాధూనాం దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం।**
**సంభాషణం కోటి తీర్థపుణ్యం, వందనం మోక్షసాధనం॥**

అన్నారు. మహాత్ములతో సంభాషిస్తే సర్వతీర్థాలలో స్నానం చేసినదానికంటే ఎక్కువ పవిత్రత కలుగుతుంది."

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD